Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.10.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 21 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

ఈనాడు సాక్షి **సంక్షోభంలో మీడియా** వార్త ఆంధ్రజ్యోతి

# ఎడిషన్లు మూసేస్తున్నాయి..!

- ఇప్పటికే కొన్ని ఎడిషన్లు మూసేసిన ఈనాడు
- అదే కోవలో ముందుకెళ్తున్న సాక్షి
- ఉద్యోగులకు సగానికి సగం జీతాన్ని తగ్గించేస్తున్న టివి9

ప్రజాస్వామ్యంలో వున్న నాలుగు మూలస్థంభాలలో ఒకటైన "మీడియా" ప్రస్తుతం సంక్షోభంలో పడింది. ఒకప్పుడు ఎన్ని ఎక్కువ ఎడిషన్లు వుంటే అంత గొప్పగా ఫీలయిన దినపత్రికల యాజమాన్యం ఎక్కువ ఎడిషన్లతో తిప్పలపాలై ఇప్పుడు మూసివేత బాటనపడ్డాయి. ఒకదానితో ఒకటి పోటీపడి రాష్ట్రవ్యాప్తంగా ఎడిషన్లను ప్రారంభించిన పత్రిక యాజమాన్యాలు ఇప్పుడు మూసివేత దిశగా కూడా అంతే వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియలో భాగంగా 'ఈనాడు' ఇప్పటికే సోమాజీగూడ భవనాన్ని ఖాళీచేసేసి రామోజీఫిల్మ్‌సిటీకి మకాం మార్చేసినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని సోమాజీగూడలో ఒక ల్యాండ్‌మార్క్‌గా అవతరించిన ఈనాడు భవనం ఇప్పుడు వ్యాపార సముదాయంగా మారబోతోంది.

1878 సంవత్సరంలో తొలిసారిగా తెలుగులో ప్రారంభించబడిన "దేశాభిమాని" పత్రిక దగ్గర నుండి ఇప్పటివరకూ తెలుగు పత్రికా రంగంలో పుట్టి గతించిన పత్రికలూ, పాత్రికేయ వొరవడినే మార్చేసిన పత్రికలూ వందల సంఖ్యలో ఉన్నాయి. 1908వ సంవత్సరంలో తెలుగు వారపత్రికగా బొంబాయిలో పురుడుపోసుకున్న ఆంధ్రప్రత్రిక 1914లో చెన్నైకి మకాం మార్చి దినపత్రికగా రూపాంతరం చెందింది. అనంతరం 1938లో విజయవాడ నుండి తన ప్రస్థానాన్ని కొనసాగించింది. 20వ శతాబ్దంలో "పరిషత్ పత్రిక", "కృష్ణపత్రిక", "గోల్కొండ పత్రిక", "ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక", "ఆంధ్రప్రభ" వంటి దినపత్రికలతో పాటు "భారతి" అనే మాసపత్రిక స్ఫూర్తిగా వేలసంఖ్యలో వార, పక్ష, మాస పత్రికలు తెలుగువారికి (మిగతా 10వ పేజీలో)

## అందరికీ ఆదర్శం... బెజవాడ గోపాలరెడ్డి

(వివరాలు 5వ పేజీలో)

- అవార్డు సభలో వక్తలు





## ఉత్తరక్రియలు

మూర్తీభవించిన మానవత్వం, పరిమళించిన ప్రేమామృత హృదయంతో
మా జీవితాలలో వెలుగులు నింపిన తేజోమూర్తి,
మా మనోమందిరాలలో దివ్యదీప్తి

**శ్రీమతి కొండ్రెడ్డి సంధ్య**

తేది 13-10-2014 సోమవారం నాడు స్వర్గస్తులైనారు. వారి పవిత్రాత్మకు
శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త : కొండ్రెడ్డి రంగారెడ్డి తల్లి : పుచ్చకాయల సరోజనమ్మ
చైర్మన్ : విజయ డైరి

అత్త - మామ : కొండ్రెడ్డి దశరధరామిరెడ్డి - అన్నమ్మ
కుమారుడు - కోడలు : కొండ్రెడ్డి భరత్‌కుమార్ - ఇందిర
కుమార్తె - అల్లుడు : దువ్వూరు సింధు - విష్ణుజితేంద్రరెడ్డి
మనుమలు, మనుమరాలు : రోహన్, సూర్య, శ్రేయ

**శ్రీమతి కొండ్రెడ్డి సంధ్య**
చైర్మన్ : శ్రీ వరదరాజస్వామి వారి దేవస్థానం, నార్త్‌మోపూరు.
మాజీ సర్పంచ్, నార్త్‌మోపూరు :: మాజీ జడ్పీటిసి, ఇందుకూరుపేట
జననం : 04-09-1955 మరణం : 13-10-2014

పెద్దకర్మ : తేది 25-10-2014 శనివారం ఉదయం 10 గంటల నుండి
అల్లూరు మండలం, నార్త్‌మోపూరులోని మా స్వగృహమునందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## గ్రామాలలో...
# ఇసుక యుద్ధం!



**తెలుగుదేశం ప్రభుత్వం ఇసుక రీచ్‌ల విషయంలో టెండర్లు, బహిరంగ వేలం విధానానికి మంగళం పాడటం తెలిసిందే! ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాలకు వీటిని కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. ఇక్కడ నుండే అసలు రాజీయం మొదలవుతోంది.**

ఇంతకుముందు టెండర్ల విధానంలో పెద్దగా రాజకీయ జోక్యముండేది కాదు. ఎవరు ఎక్కువ ధరకు కోట్ చేస్తే వారికే రీచ్‌లు దక్కేవి. ఒకవేళ రాజకీయ జోక్యం ఉన్నా కూడా ప్రభుత్వానికి ఆర్థికంగా పెద్దగా నష్టం వచ్చేది కాదు. ఇప్పుడు ఇసుకరీచ్‌లను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించడంతో ఇసుకరీచ్‌లున్న ప్రతి గ్రామంలోనూ రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. తెలుగుదేశం నాయకుల సిఫారసువున్న మహిళా సంఘాలకే ఇసుకరీచ్‌లు దక్కనున్నాయి. ఇసుక రవాణా కాంట్రాక్టుల్లో సైతం అధికారపార్టీ హవా నడవబోతుంది. ఈమధ్య ఇసుక రవాణాకు టెండర్లను ఆహ్వానించారు. అన్ని పార్టీల వాళ్లు కూడా టెండర్లు వేశారు. నిబంధనల ప్రకారం ఎవరైతే తక్కువ ధరకు ఇసుక రవాణా చేస్తామని టెండర్ వేసుంటే వారికే ఇసుక రవాణా బాధ్యత అప్పగించాలి. కాని నెల్లూరుజిల్లాలోనే ఈ విధంగా జరిగిన టెండర్లలో చాలామంది వైయస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ మద్దతుదారులు పాల్గొన్నారు. వాళ్లు తక్కువ ధరకు కోట్ చేసి ఉండడం, ఇసుక రవాణా కాంట్రాక్ట్‌లు నిబంధనల ప్రకారం వారికే ఇవ్వాల్సి రావడంతో టెండర్‌దారులు సిండికేట్ అయ్యారంటూ అధికారపార్టీ ఒత్తిడితో అధికారులు ఈ టెండర్లను రద్దు చేశారు. ఇప్పుడు అధికారపార్టీ నాయకులు నిర్ణయించిన వారికే ఇసుక రవాణా కాంట్రాక్టులు దక్కనున్నాయి. ఇసుక రవాణాకు ప్రభుత్వమే ఒక ధరను నిర్ణయించబోతుంది. ఇది కూడా వినియోగదారుడి మీదే పడబోతుంది. ఇసుకరీచ్‌ల మీద ఆధారపడి జిల్లాలోని పలు గ్రామాల్లో వేలసంఖ్యలో ట్రాక్టర్లను కొని పెట్టి ఉన్నారు. ఈమధ్య ఇసుకరీచ్‌లు లేకపోవడం వల్ల ఈ ట్రాక్టర్లన్నింటిని ఇళ్ల వద్ద పెట్టుకుని ఉన్నారు. ఇప్పుడు ఇసుక రవాణాకు మా ట్రాక్టర్లను పెట్టుకోండంటూ వాళ్లంతా ఆయా గ్రామాల తెలుగుదేశం నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. మొత్తానికి ఇసుక రీచ్‌ల ద్వారా తెలుగుదేశం పార్టీ వాళ్లు గ్రామాలలో తమ పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తుండడం విశేషం.

# ప్రభుత్వాసుపత్రులంటే అంత చులకనా?

సింహపురి సమాచారం

## – వైద్యాధికారి తీరుపై కలెక్టర్ మండిపాటు

'మీకు ప్రభుత్వాసుపత్రి అంటే అంత చులకనా?.. ఇంత అధ్వాన్నంగానా ఆసుపత్రి వుండడం, మీకు అసలు ఉద్యోగాలు ఎందుకూ?.. సొంత ఆసుపత్రి వుంది కదా.. అది నడుపుకోండి'.. అంటూ వెంకటగిరి వైద్యాధికారి తీరుపై జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మండిపడ్డారు.

ఈ నెల 18వ తేదీన ఆయన వెంకటగిరిలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. అక్కడ వార్డులు, గదులు, మరుగుదొడ్లు మురికిగబ్బుతో వుండడం చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లస్టర్ వైద్యాధికారిణి హరిప్రియ ఆసుపత్రి నిర్వహణ తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీకు సొంత ఆసుపత్రి వుంది కదా అని అడగ్గా, ఆమె ఉందని చెప్పడంతో, మీ ఆసుపత్రి కూడా ఇలాగే వుంటుందా?..ప్రభుత్వాసుపత్రి అంటే మీకంత చులకన ఎందుకు?..అని ఆమెను ప్రశ్నించారు. మీకు ఇష్టం లేకపోతే వెళ్ళండి, మరొకరికి ఆ ఉద్యోగాలొస్తాయి. ఆసుపత్రి వాతావరణం ఇంత అపరిశుభ్రంగా వుండడం సహించలేం. వెంటనే పరిశుభ్రం చేయించండి..అంటూ కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు వున్నా కూడా ఆసుపత్రిని ఇంత అధ్వాన్నంగా వుంచడం ఏమిటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వార్డులోనూ రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాలు ఏర్పాటుచేసి, వ్యాధుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం, ఉపాధ్యాయనగర్‌లో డెంగ్యూ వ్యాధిగ్రస్తుడైన చందును కలెక్టర్ పరామర్శించారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజలను మోసపుచ్చే చర్యల వల్ల ప్రయోజనం లేదు.. కంటితుడుపు చర్యలు తీసుకుంటే ప్రజల్లో నమ్మకం పోతుందని, ప్రజల సమస్యలు తీర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రజలను కూడా అందులో భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన పలు ప్రాంతాలను సందర్శించి అధికారులకు తగు సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ తదితరులున్నారు.



# సర్వేపల్లి సుడి తిరగనుంది

• వెయ్యి కోట్లతో ఎరువుల కర్మాగారం • రెండేళ్లలో నిర్మాణపనులు

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎరువుల కర్మాగారాన్ని నెల్లూరుజిల్లాలో నిర్మించేందుకు క్రిబ్‌కో ముందుకు వచ్చింది. ఈమేరకు ప్రభుత్వం ఏపిఐఐసి కార్యాలయానికి ఉత్తర్వులు పంపింది. నెల్లూరుజిల్లాలోని సర్వేపల్లి ప్రాంతంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగాను దాదాపు 300ఎకరాల భూసేకరణ కూడా పూర్తయింది. రోజుకు 1650 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉండేలా ఏర్పాటు చేయనున్నారు. సర్వేపల్లి ప్రాంతంలో క్రిబ్‌కో డిఏపి ఎరువుల కర్మాగారం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. దాదాపు 300 ఎకరాలను రైతుల వద్ద నుంచి సేకరించారు. జిల్లా ఏపిఐఐసి ద్వారా ప్రభుత్వం ఈ భూసేకరణ పూర్తి చేసింది. రైతులకు ఎకరానికి రూ.7లక్షలు వరకు చెల్లించింది. సర్వేపల్లి ప్రాంతంలో నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్న క్రిబ్‌కో ఎరువుల కర్మాగారంలో రోజుకు 1650టన్నుల ఉత్పత్తి చేయనున్నారు. ఉత్పత్తి ద్వారా వచ్చిన ఎరువులను మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయనున్నారు. డిఏపి ఎరువుల కర్మాగారాన్ని సుమారు వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్నారు.

# ఆంధ్ర, తెలంగాణ జాయింట్ విన్నర్లు




నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో మూడురోజులుగా జరిగిన అఖిలభారత బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిసాయి. పురుషుల సెమీఫైనల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర జట్లు, మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల జట్లు తలపడ్డాయి. మధ్యాహ్నం ఫైనల్స్ జరగాల్సి వుండగా వర్షంకారణంగా పోటీలకు ఆటంకం ఏర్పడింది. దీంతో ఫైనల్స్‌లో జాయింట్ విన్నర్స్‌గా ఆయా రాష్ట్రాల క్రీడాకారులను ప్రకటించారు. మహిళల విభాగంలో విజేతలుగా తమిళనాడు, కర్నాటక జట్లు జాయింట్ విన్నర్స్‌గా నిలవగా, ఆంధ్రప్రదేశ్, కేరళ జట్లు మూడవ స్థానాన్ని సాధించాయి. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, షీల్డులను ప్రదానం చేశారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నెల్లూరుజిల్లాలో నిర్వహించడం శుభపరిణామమన్నారు.

ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, బాల్‌బ్యాడ్మింటన్ నిర్వహణ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి శశిధర్, ప్రసాద్‌నాయుడు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా క్యాంప్‌ఫైర్:** ఆలిండియా బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్ కప్ పోటీల సందర్భంగా ఈనెల 18వతేదీ రాత్రి క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'పాడుతాతీయగా'లో విజేతగా నిలిచిన గాయకుడు ప్రవీణ్‌కుమార్ పలు గీతాలను ఆలపించి అందరినీ అలరించారు.

## బాలుడి మృతికి
# వివాహేతర సంబంధమే కారణం

నెల్లూరుజిల్లా కావలి పట్టణం వైకుంఠపురం శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మంద వెంకటసాయికృష్ణ మృతికి ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయిని వివాహేతర సంబంధమే కారణమని కావలి డిఎస్పీ డి.మోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఈ నెల 11న బాలుడి మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు అసలు విషయం తెలిపారు. డిఎస్పీ కథనం మేరకు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయ్యన్న, అదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కౌశల్య మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఒకరోజు వీరిద్దరు పాఠశాల గదిలో ఉండగా వెంకటసాయికృష్ణ చూశాడు. వీరి గుట్టు రట్టు చేస్తాడేమోనని విద్యార్థిని భయపెట్టాలని కౌశల్య అయ్యన్నకు సూచించింది. బాలుడిని మందలించే యత్నంలో అయ్యన్న బాలుడి చెంపపై బలంగా కొట్టగా ప్రక్కనే ఉన్న కిచెన్‌స్లాబ్‌పై పడడంతో విద్యార్థి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో బాలుడు మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారు. వీరి ప్రయత్నాలు ఫలించక పోవడంతో రకరకాల కారణాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. పోలీసులు విచారణలో జరిగిన విషయాన్ని నిందితులు బయటపెట్టడంతో బాలుడి మృతిపై సందేహాలు బహిర్గతమయ్యాయి. నిందితులను సోమవారం కావలి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

# పోలీసు కుటుంబానికి రూ.5లక్షలు అందజేత



నెల్లూరుజిల్లా ఎఎస్‌పేట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.ఉదయకుమార్ విధుల్లో భాగంగా గత ఫిబ్రవరి నెల 17వతేదీ రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. ఉదయ్‌కుమార్‌కు రావలసిన జనరల్ ఇన్సూరెన్స్ రూ.5లక్షల చెక్కును నెల్లూరుజిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ సోమవారం మృతుని తల్లి కె.వెంకటసుబ్బమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రెడ్డి గంగాధరరావు, పోలీసు అధికారుల సంక్షేమసంఘం అధ్యక్షులు వరప్రసాద్, డిపిఒ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కన్నెర్రజేస్తున్న కమిషనర్



**నెల్లూరు నగర పాలక సంస్థ సిబ్బంది పనితీరుపై, వారి అలసత్వంపై కొత్తగా వచ్చిన కమిషనర్ చక్రధర్‌బాబు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇన్నాళ్లూ మొద్దునిద్రలో వున్న కార్పొరేషన్ ఫైళ్ళను కదిలిస్తున్నారు. విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.**

తాజాగా, కార్పొరేషన్ అకౌంటెంట్‌ను సస్పెండ్ చేయడంతో, కార్పొరేషన్ సిబ్బందికి వణుకు ప్రారంభమైంది. క్యాష్‌బుక్ నిర్వహణలోనూ, జమా ఖర్చులు సక్రమంగా లేకపోవడంతో అకౌంటెంట్‌పై ఆ మేరకు చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, పెద్దమొత్తంలో చెక్కులకు సంబంధించిన లెక్కలు సక్రమంగా లేకపోవడంతో అకౌంటెంట్‌పై వేటు వేసినట్లు భోగట్టా. దీంతో, సిబ్బందిలో కలవరం ప్రారంభమైంది. ఇప్పటిదాకా తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో కొందరు, నాయకుల అండదండలతో మరికొందరు కార్పొరేషన్‌లో పనిచేస్తూ, రకరకాల వ్యవహారాలు సాగిస్తున్నవారికి ఇప్పుడు కంటిమీద కునుకు రావడం లేదు. కమిషనర్ ఎప్పుడు ఎలాంటి తనిఖీలు చేస్తారో, తమ అవినీతి, అక్రమాలు ఎక్కడ బయటపడుతాయోనని అక్రమార్కులు బెంబేలు పడుతున్నారు. కమిషనర్ ఐఎఎస్ అధికారి కనుక, అందులోనూ ఐపిఎస్ కూడా చేసి వున్నారు కనుక, ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, ఎక్కడ ఎలాంటి లొసుగులు వున్నా వెంటనే కఠిన చర్యలు తీసుకుంటారని వారు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే అనేక అవినీతి అక్రమాల వూబిలో కూరుకుపోయిన కార్పొరేషన్‌కు చక్రధర్‌బాబు రాక మింగుడు పడడం లేదు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తూనే వున్నా, పెద్దఎత్తున సిబ్బంది, యంత్రాంగం వున్నా నెల్లూరు నగరం మురికికూపంలా ఎందుకుంటోందో?..ఆ నిధులన్నీ ఏమవుతున్నాయో, ఎక్కడెక్కడ ఎలాంటి అవినీతి జరిగిందో, ఎన్నెన్ని అక్రమాలు జరిగాయో, అన్నిటినీ ఆరా తీసి, అక్రమార్కుల భరతం పట్టేందుకు కమిషనర్ సిద్ధంగా వున్నారని సిబ్బంది, ఉద్యోగులు భయపడిపోతున్నారు. నగరంలో ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, చెత్తకుప్పలమయంగా వుంటోంది. దోమల బెడద వర్ణనాతీతం. ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామంటారే కానీ, చేసింది లేదు. ఎంతో కాలంగా మాటలతోనే కాలయాపన. నగరంలోని ప్రధాన కూడళ్ళు, బాలాజీనగర్, ఎసి నగర్, మూలపేట, రంగనాయకులపేట, స్టోన్ హౌస్‌పేట, దర్గామిట్ట.. ఇలా ఏ ప్రాంతంలో చూసినా దుర్గంధమే రాజ్యమేలుతోంటుంది. ఇక చిన్న వాన వచ్చిందంటే చాలు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడెక్కడి మురుగునీరంతా వీధుల్లో పారుతూంటుంది. వ్యాధుల బాధలతో ప్రజారోగ్యం అస్తవ్యస్తమైపోతుంది. ఇంత దౌర్భాగ్యమైన స్థితి ఏ వూరికీ వుండదు. వేలాది రూపాయలు జీతం తీసుకుంటున్నా, అడుగడుగునా పాతుకుపోయిన అవినీతి, ప్రతి చిన్నపనికీ ముడుపులు మూటగట్టుకోవడం, అక్రమార్జనతో ఆస్తులు కూడబెట్టుకోవడం, బినామీ ఆస్తులు పెంచుకోవడం, అందినకాడికి దోచుకోవడమే తప్ప ప్రజల బాధలు పట్టించుకోరనే ఆరోపణలు కార్పొరేషన్‌పై కోకొల్లలుగానే వున్నాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం నేటి అధ్వాన్న నగరమే. ఎంతమంది పారిశుద్ధ్య సిబ్బంది, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, పెద్ద యంత్రాంగం వున్నా మురుగుదిబ్బలు ఎక్కడవక్కడనే వుంటాయి. చెత్తను సక్రమంగా ఎత్తివేసే దిక్కే వుండదు. సైడు కాలువల్లో పూడికలు తీసేవారు లేక వీధులు గబ్బుకొడుతుంటాయి. దోమలు ప్రజలను నరకయాతన పెడుతున్నా కనీసం క్రమబద్ధంగా ఫాగింగ్ చేసే నాధులు వుండరు. విచ్చలవిడిగా ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకునేవారే వుండరు. చిన్నారులకు, పెద్దలకు ఆటవిడుపుగా ప్రశాంతతకు నిలయాలుగా వుండాల్సిన పార్కులు పరమ అధ్వాన్నంగా వుంటాయి. కార్పొరేషన్ పాలనలోని పాఠశాలలు సమస్యల వలయంలో పడి సతమతమవుతున్నా పట్టించుకునేవారే కరువు.. సరైన వసతులు లేక, అవసరమైనంతమంది ఉపాధ్యాయులు లేక పాఠశాలలు అస్తుబిస్తుగా వున్నాయి. శివారు ప్రాంతాలు సమస్యలతో అల్లాడుతున్నాయి. ఒకవైపు అక్రమ కొళాయిలు పెరిగిపోతుంటే, మరోవైపు శుభ్రమైన మంచినీటికి కూడా నోచుకోని ప్రాంతాలూ పెరుగుతున్నాయి. ప్రజారోగ్యం అన్నది ఎప్పుడో పడకేసింది. కార్పొరేషన్ పాలన ఒక్క మాటలో చెప్పాలంటే మొద్దునిద్రలో వుంది. అసలు, సమయానికి కార్యాలయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో వుంటూ విధులు నిర్వహించే సిబ్బంది ఇక్కడ తక్కువ. ఏ కొద్దిమందో తప్ప, అధికశాతం సిబ్బందికి ప్రజల సమస్యలపై నిర్లక్ష్యమే ఎక్కువ. హాజరుపట్టీ వున్నా, ఎవరెక్కడికి వెళ్తున్నారో, ఏ డ్యూటీలో ఎక్కడ వుంటున్నారో తెలుసుకోవడం అంత సులభమేమీ కాదు. ఇకనైనా సిబ్బంది హాజరును క్రమబద్ధంచేసే విధంగా బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, ప్రతి విభాగంలోనూ, ప్రతి గదిలోనూ నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి, సిబ్బంది పనితీరును ఎప్పటి కప్పుడు పరిశీలిస్తే తప్ప పనితీరు మెరుగు పడదనీ ప్రజాభిప్రాయం. గత పాలకుల పాలనలో, అస్తవ్యస్త విధానాలతో కార్పొరేషన్ పూర్తిగా భ్రష్టుపట్టిపోయింది. ఎవరేమి చేసినా, ఎవరెంత తిన్నా అడిగే వారూ, అదుపు చేసేవారూ లేకపోయారు. దీంతో, కార్పొరేషన్‌లో పనిచేయడమంటే అక్రమార్జనకు అడ్డేమీ వుండదనే అభిప్రాయం అంతటా స్థిరపడిపోయింది. ఇకనైనా కొత్త కమిషనర్ వీటన్నిటికీ అడుగడుగునా చెక్ పెట్టాలన్నది ప్రజలందరి కోరిక. ఐఎఎస్ అధికారి కమిషనర్‌గా వస్తే ఎలా వుంటుందో ఒకసారి సత్తా చూపాలి. ఇప్పటిదాకా ఎక్కడెక్కడ ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో బయటకు తీయాలి. అక్రమార్కుల భరతం పట్టాలి.. కార్పొరేషన్ పాలనను తిరిగి గాడిన పెట్టాలి.. తిరిగి నగర పాలక సంస్థ ప్రజలకు సుపరిపాలనను అందించాలి.. ఇదీ నగర ప్రజల ఆకాంక్ష.

అంతేకాదు, అవినీతి–అక్రమాలకు ఇకపై తావులేకుండా నిరోధించేందుకు కార్పొరేషన్‌లో ఒక ప్రత్యేక రహస్య నిఘా విభాగాన్ని కూడా నియమించుకుని, ఏ విభాగంలో ఎలాంటి అక్రమాలు జరుగుతున్నాయో కనిపెట్టి, ఎప్పటికప్పుడు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కమిషనర్ చర్యలు తీసుకుంటే బావుంటుందనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా, అన్ని రకాల ఫైళ్ళను కంప్యూటరీకరణ చేయించి, నిరంతరం పర్యవేక్షణ చేస్తే తప్ప, ఫైళ్ళ నత్తనడక ఆగదు. నిపుణుల పర్యవేక్షణ వుంటే తప్ప ఒక ప్రహసనంగా మారిన పన్నుల ప్రక్రియ ఒక కొలిక్కి రాదు. తవ్వి చూడాలే కానీ, ప్రతి విషయంలోనూ లొసుగులే కనిపిస్తాయి. వీటన్నిటినీ కార్పొరేషన్‌లో అడుగడుగునా పట్టిన అలసత్వం, అవినీతి–అక్రమాల చెదలును వదలగొట్టేందుకు, అణువణువూ ప్రక్షాళన జరగాలి. ఒక ఐఎఎస్ అధికారిగా, ఈ నగరపాలక సంస్థ తీరును క్రమబద్ధం చేయడం ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలి. అందుకు ప్రతి విషయంలోనూ కఠినమైన చర్యలే తీసుకోవాలి. లేకుంటే పరిస్థితి మళ్ళీ యథాతథంగానే వుంటుంది.

అసలే, ఎంతో ప్రతిష్టాత్మకమైన, చరిత్రాత్మకమైన నెల్లూరు నగరం ఇప్పటికే తన వైభవాన్ని కోల్పోయింది. మురికి గబ్బుతో, మురుగుదిబ్బగా మారిపోయింది. కొత్త కమిషనర్ చక్రధర్‌బాబు నిర్విరామ కృషితో ఇకనైనా నెల్లూరు సుందర నందనవనం కావాలి.. ప్రజలు కన్న కలలు సాకారం కావాలి... ఇదే ప్రజలందరి ఆకాంక్ష!..

## గ్రామీణ వైద్యుల గుర్తింపుకు సిఎం సుముఖం

నెల్లూరు గ్రామీణ ప్రాంతాల్లో అనుభవం ప్రాతిపదికన పనిచేసే వైద్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సముఖంగా ఉన్నట్లు తెలుగుదేశంపార్టీ జిల్లా వైద్య విభాగం కన్వీనర్ డా॥ జడ్.శివప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో శివప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పారా మెడిక్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డా॥ జి.వి.కృష్ణమూర్తి, జాతీయ నాయకులు డా॥ కిషోర్‌కుమార్ నాదెండ్ల, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రవిచంద్ర, రవీంద్రబాబు, డివిజన్ నాయకులు గోవింద్, మస్తానయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులను శాలువాలతో సత్కరించారు.



కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న రత్నం విద్యాసంస్థల అధినేత కె.వేణుగోపాల్


## బాధితులకు 'రత్నం' చేయూత

ఉత్తరాంధ్ర తుఫాన్ బాధితుల సహాయార్థం రత్నం విద్యాసంస్థల అధినేత కె.వేణుగోపాల్ 3,22,550రూపాయల చెక్కును బుధవారం జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు అందజేశారు. విద్యాసంస్థల యాజమాన్యం తరపున 1,72,550 రూపాయలను అలాగే విద్యార్థులు సేకరించిన విరాళాలు లక్షా 50వేల రూపాయలు కలిపి మొత్తాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు చెక్కు రూపేణ అందజేశారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల సేవానిరతిని కలెక్టర్ శ్రీకాంత్ అభినందించారు. రత్నం విద్యాసంస్థల దాతృత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. తండ్రి కె.వి.రత్నం ఆశయాలకు అనుగుణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనవంతుగా వెంటనే స్పందించిన ఆయన తనయుడు వేణుగోపాల్‌కు 'లాయర్' అభినందనలు.

## నిస్సహాయుల కోసం జోలెపట్టి...



అధికారంలో వున్నా లేకున్నా, పదవి వున్నా లేకున్నా ఆనం వివేకా స్టైలే వేరు. ఏ పనిచేసినా అందరిలో ఒకడిలా కాక అందరికీ భిన్నంగా చేయడం, అందరి కంట్లో పడడం ఆయనకు అలవాటు. మొన్నటి ఎన్నికల నుండే పోటీకి దూరమైన వివేకా ప్రజాజీవితం నుండి తప్పుకోలేదు. హుద్ హుద్ తుఫాన్ బాధితుల సహాయార్థం నెల్లూరు నగరంలో వివేకా జోలెపట్టి భిక్షమెత్తారు. తనతో పాటు డిసిసి అధ్యక్షులు, డిఆర్ త్రీస్టార్ హోటల్ అధినేత కొడవలూరు ధనుంజయరెడ్డి, తన కుమారులు ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలను కూడా నగరంలో తన వెంట తిప్పి విరాళాలకు జోలె పట్టించాడు. సుబేదారుపేట, సంతపేట, ట్రంకురోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రతి షాపు తిరిగి వివేకా విరాళాలు వసూలు చేశారు. అంతేకాకుండా కొన్ని టిఫిన్ సెంటర్ల వద్ద తానే స్వయంగా పోసిన దోశెలను వేలానికి పెట్టి ఆ విధంగా కూడా బాధితుల కోసం విరాళాలు వసూలు చేయడం విశేషం.



### నెల్లూరీయులకు కానుకగా
## ఎఎన్ఆర్ ఫంక్షన్‌హాల్

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు నగరంలో ప్రజలకు ఎన్ని కల్యాణ మండపాలు అందుబాటులోకి వచ్చినా చాలడం లేదు. అదీగాక ఎక్కువ శాతం కల్యాణ మండపాలలో పార్కింగ్ సమస్య ఉంటుంది. వీటిని అధిగమిస్తూ... నెల్లూరు మినీబైపాస్‌లో జివిఆర్ఆర్ జూనియర్ కాలేజీ పక్కన బండి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత సుందరంగా, ఆధునికంగా నిర్మించిన ఎఎన్ఆర్ ఏ/సి ఫంక్షన్‌హాల్ నెల్లూరీయులకు అందుబాటులోకి వచ్చింది. విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన ఈ ఫంక్షన్‌హాలు వద్ద పార్కింగ్‌కు ఏ సమస్యా లేదు. వివాహాలు, సమావేశాలు, రిసెప్షన్ వేడుకలు, నిశ్చితార్థం వంటి వేడుకలను ఎంతో సౌకర్యవంతంగా ఆనందమయంగా చేసుకునేలా ఈ హాల్‌ను అందించిన యాజమాన్యానికి 'లాయర్' అభినందనలు.

# 'ప్రభా'తం

మరో సారి మోదీ ప్రభంజనం వెల్లువెత్తింది. రెండు రాష్ట్రాల్లో ఓటర్ల హృదయాలను గెలుచుకుంటూ అప్రతిహతంగా ముందుకు సాగుతూ, బిజెపి విజయకేతనం ఎగురవేసింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ, హర్యానా ఎన్నికల్లోనూ భారతీయ జనతాపార్టీ విజయదుంధుభి మోగించింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు గాను, 122 స్థానాలు సాధించి ఆ రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అదేవిధంగా హర్యానాలోనూ మొత్తం 90 స్థానాల్లో 47 స్థానాలను కమలనాథులు కైవసం చేసుకున్నారు. ఇక్కడ బిజెపి అధికారంలోకి వచ్చేందుకు పూర్తి మెజార్టీ వచ్చింది. మహారాష్ట్రలోని మరో కీలకమైన శివసేన పార్టీ కేవలం 63 స్థానాల్లో విజయం సాధించి రెండవ స్థానానికి చేరుకోగా, అటు మహారాష్ట్ర ఇటు హర్యానాల్లో కాంగ్రెస్ చతికిలబడిపోయింది. కేవలం స్వల్ప స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో, బిజెపి అత్యధిక స్థానాలు కైవశం చేసుకుని తన ప్రతిష్టను నిలుపుకుంది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ప్రధాని మోదీ సొంతరాష్ట్రమైన గుజరాత్‌లోను, బీహార్‌లోనూ కొంతమేరకు బిజెపికి ఎదురుదెబ్బ తగలడం కొంత విమర్శలకు తావిచ్చినప్పటికీ, తాజాగా ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపిని విజయపథంలోకి నడిపించడంతో, మోదీ ప్రభంజనం ఏమిటో మరోసారి రుజువు చేసినట్లయింది. గత ఎన్నికల్లో హర్యానాలో బిజెపి కేవలం నాలుగు స్థానాలే సాధించుకున్న నేపథ్యంలో, ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఒకేసారి 90 స్థానాల్లో 47 స్థానాలను కైవశం చేసుకోవడం ఎంతైనా విశేషం.

అదేవిధంగా, హర్యానాలోనూ బిజెపి ఇక కనుమరుగవుతుందేమోననే పరిస్థితి వుండగా, తాజా రాజకీయాల నేపథ్యంలో అటు మోడీ అభివృద్ధి మంత్రం, ఇటు అమిత్‌షా రాజకీయ తంత్రంతో ఈ రాష్ట్రంలోనూ బిజెపి స్పష్టమైన మెజార్టీ సాధించడం విశేషం. అందులోనూ మహారాష్ట్రలో దాదాపు పాతికేళ్ళుగా కలసివున్న శివసేనకు గుడ్‌బై చెప్పి, చివరిదశలో ఒంటరిగా బరిలోకి దిగినప్పటికీ బిజెపి ప్రభంజనం వెల్లువెత్తడం వెనుక మోడీ ప్రచారశైలి, విధి విధానాల్లో ఆయనకున్న నిబద్ధత, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆయన చేస్తున్న అనితరసాధ్యమైన కృషి, దేశ విదేశాల్లో మోడీ విధానాలు ప్రజలందరినీ విశేషంగా ఆకట్టుకుంటూవుండడం వగైరాలన్నీ ప్రధాన కారణాలే అని చెప్పవచ్చు. బిజెపి-శివసేన విడిపోవడం వల్ల చివరికి బిజెపికే ఎక్కువ నష్టం రావచ్చేమోననే అభిప్రాయాలున్నప్పటికీ, తీరా ఎన్నికల్లో శివసేనను సైతం అధిగమించి, కాంగ్రెస్‌ను మూడవస్థానంలోకి నెట్టి, పెద్దఎత్తున బిజెపి విజయం సాధించడం వెనుక బిజెపి అగ్రనేతలైన ప్రధాని మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాజకీయ చతురతే కారణమని చెప్పాలి. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రధాని నరేంద్రమోడీపై ప్రజలకు వున్న అపారమైన విశ్వాసం నలుసంత కూడా సన్నగిల్లలేదనడానికి ఈ ఎన్నికల్లో బిజెపి విజయం ఒక నిదర్శనం. హర్యానాలో తొలిసారిగా బిజెపి ప్రభుత్వం ఏర్పడనుండడం, అదేవిధంగా మహారాష్ట్రలో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించడం ఈ రెండూ ఎంతో విశేషమైన అంశాలే. మహారాష్ట్రలో అధికారానికి కొన్ని సీట్లు తక్కువపడినా, బిజెపి వ్యూహరచనతో తమతో ఏకీభవించే పార్టీల మద్దతును కూడగట్టుకుని అధికారం పీఠం అధిష్టించేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపితో పాటు, శివసేన కూడా బిజెపికి మద్దతు ఇచ్చే అంశాలను పరిశీలిస్తున్నాయి. ఇదిలావుంటే, ఇప్పటి ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి మాత్రం పదే పదే వేదన కలిగిస్తూనే వున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత ఘోరంగా పరాజయం పాలై, కనీసం ప్రతిపక్ష హోదా కూడా సాధించలేకపోయిన కాంగ్రెస్‌కు నేటికీ కనీస వూరట కూడా లభించడం లేదు. ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ దారుణ ఓటమినే చవిచూసింది. మూడవ స్థానానికి పడిపోయింది. దీంతో, ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాకు కూడా కాంగ్రెస్ దూరమైపోయింది. మోడీ వాగ్ధాటి ముందు, ప్రచారహోరు ముందు, నిజాయితీతో, నిబద్ధతతో ఆయన అనుసరిస్తున్న అనేకానేక ప్రజాసంక్షేమ విధానాల ముందు..కాంగ్రెస్ వెలవెలబోతోంది. అటు మహారాష్ట్ర, ఇటు హర్యానా రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పెద్దపెద్ద నాయకులే మోడీ ప్రభంజనం ధాటికి చతికిలపడిపోయారంటే ప్రజలపట్ల మోడీకి వున్న చిత్త శుద్ధి, ప్రజలకు మోడీపట్ల పెరుగుతున్న అభిమానం రెండూ ప్రధాన కారణం. అటు మోడీ దీక్షక్తి, ఇటు అమిత్‌షా వ్యూహరచనాశక్తి రెండూ కలసి మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బిజెపికి ఘనవిజయం చేకూర్చిపెట్టాయి. ఎన్నికల వ్యూహరచనలో తమకెదురు లేదనిపించే నారాయణ్ రాణే, సావిత్రీజిందాల్, రణబీర్ సింగ్ మహేంద్ర వంటి ఉద్దండులైన కాంగ్రెస్ నాయకులు సైతం బిజెపి చేతిలో చిత్తుచిత్తుగా ఓడిపోయారు. అంతేకాదు, ఈ రెండు రాష్ట్రాల్లో కొన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులు కూడా కాంగ్రెస్‌కు కరువయ్యారంటే, కాంగ్రెస్ పరిస్థితి ఎంత దయనీయంగా మారిపోయిందో తేటతెల్లమవుతుంది. ప్రధానిగా పదవిలోకి వచ్చిన వెంటనే గత నాలుగు నెలలుగా ప్రధాని మోడీ అనుసరిస్తున్న స్పష్టమైన నిర్ణయాలు, అద్భుతమనిపించే విదేశాంగ విధానాలు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రవేశపెడుతున్న అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు, అవినీతి-అక్రమాలను దూరం చేసి, నిజాయితీ-నిబద్ధతతో దేశంలో స్వచ్ఛమైన.. నీతివంతమైన, సుపరిపాలన, సుస్థిర పాలన అందించేందుకు చేస్తున్న కృషి అటు ప్రధాని మోడీకి, ఇటు బిజెపికి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సాధించిపెడుతున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ విజయం కూడా ఆ నేపథ్యంలోంచి వచ్చిందే అని చెప్పవచ్చు.

అటు మోడీ, ఇటు అమిత్ షా ఇద్దరూ ఈ ప్రతిష్టాత్మకమైన ఎన్నికల విషయంలో ఎవరికి వారు నిర్దిష్టమైన విధానాల్లోనూ, రాజకీయ వ్యూహరచనల్లోనూ సాటిలేదనిపించారు. ఆశనిరాశల మధ్య, రకరకాల సంశయాల మధ్య, ఏమవుతుందో ఏమో అనుకుంటూ ఈ ఎన్నికల్లో బరిలోకి దిగిన బిజెపికి..ఎవరూ ఊహించని విధంగా అఖండ విజయం చేకూర్చిపెట్టారు. ఆ ఘనత ప్రధానంగా వీరిరువురిదేనని చెప్పవచ్చు. ప్రధాని మోడీ అన్నట్లుగా, నిజంగానే ఇది ఒక చరిత్రాత్మక విజయం. ఈ ఎన్నికలు బిజెపిపై ప్రజాభిప్రాయానికే కాదు..బిజెపి పట్ల ప్రజాభిమానానికి కూడా ఇదొక నిదర్శనమనే చెప్పాలి. అభివృద్ధిని కోరుకునే ప్రజలంతా నిర్ద్వందంగా ప్రధాని మోడీనే కోరుకుంటున్నారనీ, బిజెపినే అత్యధికశాతం మంది ప్రజలు స్వాగతిస్తున్నారనే విషయం ఈ ఎన్నికల ద్వారా మరోసారి రుజువైంది. ఈ ఎన్నికల విజయంతో బిజెపి మరింత పటిష్టం కావడంతో పాటు, కేంద్రంలో సుస్థిరతకు, దేశ సమగ్రాభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడుతుందని వేరే చెప్పనక్కర లేదు. ఈ ఎన్నికల విజయం బిజెపి నేతలకు, పార్టీ కోసం అహరహం పాటుపడే కార్యకర్తలకు, బిజెపిని అభిమానించేవారందరికీ ఒక పర్వదినం లాంటిదేనని చెప్పవచ్చు. అందుకే ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలకు అవధులు లేవు. 'దీపావళి'తో పాటు ఇది కూడా ఓ పండుగేనన్న సంతోషం వారిలో కనిపిస్తోంది. ఈ అద్భుత విజయంతో బిజెపిలో ఎల్లెడలా విజయోత్సాహం వెల్లివిరుస్తోంది.

## పనితీరుపై తీర్పు



*మోడీ వాగ్ధాటి ముందు, ప్రచార హోరు ముందు, నిజాయితీతో, నిబద్ధతతో ఆయన అనుసరిస్తున్న అనేకానేక ప్రజాసంక్షేమ విధానాల ముందు..కాంగ్రెస్ వెలవెలబోతోంది. అటు మహారాష్ట్ర, ఇటు హర్యానా రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పెద్దపెద్ద నాయకులే మోడీ ప్రభంజనం ధాటికి చతికిలపడిపోయారంటే ప్రజలపట్ల మోడీకి వున్న చిత్తశుద్ధి, ప్రజలకు మోడీపట్ల పెరుగుతున్న అభిమానం రెండూ ప్రధాన కారణం.*

# ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం



జిల్లా అంతటా కార్తీకశోభ

ఎంతో పుణ్యప్రదమైన కార్తీకమాసం రానేవచ్చింది. ఈనెల 24 నుంచి కార్తీక దీప కాంతులు జిల్లా అంతటా వెల్లివిరియనున్నాయి. శరదృతువు ఉత్తరభాగంలో వచ్చే ఈ కార్తీక మాసోత్సవాలు ఎంతో ఆరాధనీయమైనవని, శివ కేశవారాధనకు ఎంతో శుభప్రదమైనదని పురాణాల ప్రశస్తి. ఈ మాసంలో భగవదారాధన, అర్చనలు, అభిషేకాలు, నదీస్నానం, ఉపవాసం, కార్తీక దీపారాధనలు, దీపదానం, సాలగ్రామ పూజలు, వన సమారాధనలు ఎంతో పుణ్యప్రదమైనవి. సూర్యోదయానికి పూర్వమే స్నానమాచరించి, నదీనదాల్లో కార్తీక దీపాలు వెలిగించి, భగవదారాధన చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని శాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ మాసంలో భగవంతుడు నదీనదాల్లో, తటాకాల్లో కొలువు తీరి వుంటాడని పురాణాలు పేర్కొంటున్నాయి. అందువల్ల కార్తీకదీపాలతో భగవంతుని ఆరాధించి ఆ నదీనదాల్లో, చెరువులు, వాగులు వంకల్లో స్నానాదికాలు చేయడం ద్వారా పుణ్యం కలుగుతుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ మాసంలో, మనం స్నానం చేసే నీటిలోనే పవిత్రమైన నదులన్నీ కలగలసి వుంటాయని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మాసంలో విష్ణువును తులసిదళాలతో, మల్లెలు, కమలపుష్పాలు, జాజిపూలు, గరిక, దర్భలతో పూజించడం ఎంతో శ్రేష్టమని, అదేవిధంగా బిల్వపత్రాలతో పరమేశ్వరుని అర్చించడం ఎంతో పుణ్యదాయకమని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఎంతోకాలంగా ఒక సంప్రదాయంగా వస్తున్న ఈ కార్తీక దీపారాధన మన జిల్లాలోనూ శాస్త్రబద్ధంగా నిర్వహిస్తారు. ఇంటింటా కార్తీక దీపాలు వెలిగించుకోవడంతో పాటు, ఆలయాల్లో విశేషమైన రీతుల్లో దీపాలను వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది.

## శివాలయంలో 24 నుంచి కార్తీక మాసోత్సవాలు



నెల్లూరులోని మూలాపేటలో వున్న శ్రీ మూలస్థానేశ్వరాలయంలోనూ ఈ నెల 24 నుంచి కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. అందుకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీన తొలి కార్తీక సోమవారం వేడుకలు కూడా పెద్దఎత్తున వైభవోపేతంగా నిర్వహిస్తారు. 30వ తేదీన కోటిసోమవారం పూజలు, నవంబరు 3వ తేదీన రెండవ సోమవారం, 10వ తేదీన మూడవ సోమవారం, 17వ తేదీన నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, దీపారాధనలు చేస్తారు. వచ్చే నెల 6వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా అఖండ కార్తీక దీపం వెలిగిస్తారు. దీప దర్శనం, చంద్ర దర్శనం, ఆలయ ప్రాకారోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్తీక దీపోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేస్తారు కనుక, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

## వెల్‌డన్ బాబు

హుద్‌హుద్ తుఫాన్‌తో అతలాకుతలమైన విశాఖపట్నంను ఆదుకోవడంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు చూపిన చొరవ అభినందనీయం. విశాఖ తేరుకునే దాకా చంద్రబాబు అక్కడే మకాం పెట్టడం, స్వీయపర్యవేక్షణలో పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం సత్ఫలితాలనిచ్చింది. తుఫాన్ భీభత్సాన్ని స్వయంగా వీక్షించిన ప్రధాని మోడీ సత్వరం స్పందించి సాయం ప్రకటించడం సంతోషించాల్సిన విషయం.

– మోహన్ వంశీ, నెల్లూరు.

## పాత కార్యాలయాలు సద్వినియోగం

నెల్లూరు నగరపాలక సంస్థకు కొత్త కార్యాలయాన్ని నిర్మించారు. కాని పాత కార్యాలయం, పాడుబడిపోతోంది. దీనిని ఇతర ప్రజాప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకుంటే బాగుంటుంది. జడ్పీకి కూడా కొత్త ఆఫీసు కట్టారు. అలాగే కలెక్టరేట్, పోలీసు ఆఫీసు కూడా కొత్తవి రానున్నాయి. కొత్తవి వచ్చాయి కదా అని చెప్పి పాత కార్యాలయాలను బూత్‌బంగ్లాలు మాదిరిగా చేయకుండా వాటిని ఉపయోగించుకునే మార్గంపై దృష్టి పెట్టాలి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.





## పరిపాలనకు ఫలితం

మహారాష్ట్ర, హర్యానాలలో బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ప్రధానిగా నరేంద్ర మోడీ కనపరుస్తున్న పనితీరే! ఎటువంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా ఆయన చేస్తున్న స్వచ్ఛమైన పరిపాలనను ప్రజలు ఆమోదిస్తున్నారు. మోడీ పనితీరు ఇదే విధంగా ఉండాలి. బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లోనూ శక్తివంతం కావాలి.

జి. శశిధర్, ఆత్మకూరు.



## విలక్షణ నటనకు, విశిష్ట వ్యక్తిత్వానికి సత్కారం...

# మోహన్‌బాబుకి బెజవాడ గోపాలరెడ్డి పురస్కారం

**ఆనందం, అభిమానం, ఆత్మీయానుభవాల మధ్య అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 21వ తేదీ సాయంత్రం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది.**

560కి పైగా చిత్రాలలో నటించడమే కాక, 60కి పైగా సొంత చిత్రాలను నిర్మించి విలన్‌గా, నిర్మాతగా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ఓ కీర్తిని, తనదంటూ ఓ ఖ్యాతిని సంపాదించుకున్న నటకళాప్రపూర్ణ పద్మశ్రీ మంచు మోహన్ బాబుకు తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య, రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, శాంత బయోటిక్స్ అధినేత పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, మాజీపార్లమెంటు సభ్యురాలు శ్రీమతి మాగుంట పార్వతమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివ ప్రభాత్‌రెడ్డి, డాక్టర్ బెగోరె అవార్డు కమిటి సభ్యులు జె.వి.రెడ్డిలు కలిసి బెగోరె అవార్డును ప్రదానం చేశారు. ఈ సభలోనే మాగుంట పార్వతమ్మ శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటాలను అతిథులకు బహూకరించగా, బెజవాడ గోపాలరెడ్డి కుమార్తె దేగా అనూరాధమ్మ శ్రీ షిర్డిసాయి బాబా వెండి పాదుకలను సాయి భక్తుడైన మోహన్ బాబుకు జె.వి.రెడ్డి ద్వారా అందజేశారు. అలాగే మానసిక వికలాంగుల కేంద్రానికి 4.25లక్షల రూపాయల చెక్కును దేగా అనూరాధమ్మ, మరో లక్ష రూపాయల చెక్కును సుదర్శనమ్మ మహిళా మండలి వారు మోహన్‌బాబు ద్వారా జె.వి.రెడ్డికి అందజేశారు.

ఈ సభలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి 'స్వీయ చరిత్ర' ఆధునీకరించబడిన రెండవ ముద్రణ పుస్తకాన్ని తమిళనాడు గవర్నర్ రోశయ్య ఆవిష్కరించారు.





### బహుముఖ ప్రజ్ఞాశాలి గోపాల్‌రెడ్డి
**– రోశయ్య**

అవార్డును మోహన్ బాబుకు అందజేయడానికి చెన్నై నుండి ప్రత్యేకంగా విచ్చేసిన తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య తన ప్రసంగంలో స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి గుణగుణాలను కీర్తించారు. చిన్నవయసులోనే ఎమ్మెల్యే అవడమేకాక రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా అనేక పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. ఏ పదవిలో వున్నా సాహిత్యంపై ప్రేమను వదులుకో లేదని, రాజకీయాల నుండి వైదొలిగాక కూడా తరచూ తన సాహితీమిత్రులను కలుసుకునేవాడని చెప్పారు. నాకు సినిమాలు చూసే అలవాటు పెద్దగా లేదు గాని, మోహన్‌బాబు నటన గురించి బాగా తెలుసు. ఆయన నటుడే కాదు మంచి విద్యాదాత కూడా! క్రమశిక్షణ అనేది ఆయన నుండే నేర్చుకోవాలి. ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేయడం అన్ని విధాలా సముచితమని రోశయ్య అన్నారు.

### ఈ అవార్డుతో నా జన్మ ధన్యం
**– మోహన్‌బాబు**

అవార్డు గ్రహీత మోహన్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు గురించి పత్రికల్లో చూసేవాడిని, రోశయ్య గారి లాంటి గొప్ప వ్యక్తులకు ఈ అవార్డు వచ్చిందని తెలుసు. అదే అవార్డు ఈరోజు నాకు రావడం ఆనందంగా ఉంది. కల్లాకపటం, అవినీతి, అక్రమాలు తెలియని నేత బెజవాడ గోపాలరెడ్డి. ఆయన పేరు మీద నెలకొల్పిన అవార్డు నాకు రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. 1980లోనే ఇక్కడ గొలగమూడిలో వున్న వెంకయ్యస్వామిని చూసి రమ్మని నాకు చాలామంది చెప్పారని, కాని ఆరోజు చూడలేకపోయానని, కాని ఈ రోజు ఈ అవార్డు పుణ్యమా అని వెంకయ్య స్వామిని దర్శనం చేసుకోగలిగానని, నా జన్మ ధన్యమైందన్నారు. టి.సుబ్బరామిరెడ్డి తనది నెల్లూరు సీడ్, బ్రీడ్ అన్నారు. నెల్లూరు సీడ్ అని చెప్పడమే కాదు, విశాఖ అభివృద్ధికి కోట్లు ఖర్చు పెడుతున్నారని, అందులో ఒకటో వంతయినా తన నెల్లూరు జిల్లా అభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. ఇది తన అత్తగారి జిల్లా అని ఆయన గుర్తు చేసుకున్నారు. సభలో ఎంతో హూందాగా మాట్లాడిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఆయన అభినందిస్తూ భవిష్యత్‌లో ఆయన మంత్రి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కులం లేని సమాజమే తన లక్ష్యమని అందుకే తన విద్యాసంస్థలోని అప్లికేషన్‌లలో కులం అనే కాలమే ఉండదన్నారు. కులం హెచ్ఐవి లాంటిదని, దానిని అంత మొందించాలన్నారు.

### నెల్లూరు ఘనతను చాటిన బెగోరె
**– సుబ్బరామిరెడ్డి**

సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరును చూస్తే తన గుండె ఆనందంతో నిండుతుందన్నారు. తనది నెల్లూరు సీడే నని, కాబట్టే దేశవ్యాప్తంగా కీర్తిప్రతిష్ఠలు పొందగలిగానన్నారు. అందరూ జీవిస్తుంటారు. మరణిస్తుంటారు. కాని మరణించినా కూడా బెజవాడ గోపాలరెడ్డి లాంటి మహనీయులు ప్రజల మనసుల్లో జీవిస్తుంటారని అన్నారు. కళలను, సాహిత్యాన్ని అభిమానించే వ్యక్తులు శాశ్వతంగా నిలిచిపోతారని, అందుకే తాను కళలను ఆరాధిస్తానని పేర్కొన్నారు. మోహన్‌బాబు విశిష్ట వ్యక్తని, విలన్ నుండి హీరోగా ఎదిగాడని, ఎన్నో చిత్రాలను నిర్మించాడని, 12వేల మంది విద్యార్థులతో విద్యాసంస్థను నడుపుతూ అందులో 10శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య నందిస్తున్నాడని చెప్పారు. కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియాన్ని తన సొంత ఖర్చుతో ఏ.సి చేయిస్తానన్నారు. ఈ సభలోనే ఆయన వేంకటేశ్వరస్వామి, శివ స్తోత్రాలను అలవోకగా ఆలపించి సభికులను భక్తి తన్మయులను చేశారు.

### విద్యారంగానికి ఆదర్శం మోహన్‌బాబు
**– కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నటుడిగానే కాక మంచి విద్యా దాతగా మోహన్‌బాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మోహన్‌బాబు నటించిన శ్రీరాములయ్య, యమధర్మరాజు యంఏ, పెద్దరాయుడు సినిమాలలో ఆయన నటించిన పాత్రలు తనకెంతో ఇష్టమన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక మళ్ళీ ఆయనతో 'మేజర్ చంద్రకాంత్' వంటి సినిమా తీసి తరతరాలు గుర్తుండిపోయేలా 'జన్మభూమి నా దేశం నమోనమామి' అనే పాటను అందించిన ఘనత మోహన్‌బాబుకే దక్కుతుందన్నారు. ముక్కుసూటి తనం మోహన్‌బాబు సొంతమని, ఆయన నిష్కళంక మనసుకు ఆయన మాటతీరే నిదర్శనమన్నారు. జన్మభూమిని, కన్నతల్లిని ఎప్పుడూ మరువకూడదని కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు తరచూ చెప్తుంటారని ఆయన మాటలను స్ఫూర్తిగా చేసుకుని ప్రపంచం మొత్తం తెలిసిన మన నెల్లూరీయుడు టి.సుబ్బరామిరెడ్డి, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు.

### ఇద్దరూ ఉద్దండులే...
**– వరప్రసాద్‌రెడ్డి**

శాంత బయోటెక్స్ అధినేత కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బెగోరె అవార్డుకు

(మిగతా 10వ పేజీలో)







# నెల్లూరు కబుర్లు

## కమిషనర్‌కు జేసీ బంగ్లా

నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ చక్రధర్‌బాబుకు నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి సమీపానవున్న జాయింట్‌కలెక్టర్ బంగ్లాను కేటాయించారు. గతంలో జేసీగా పనిచేసిన బి.లక్ష్మీకాంతం వరకు అందరు జేసీలు ఈ బంగ్లాలోనే ఉండేవాళ్లు. కాని ప్రస్తుత జాయింట్‌కలెక్టర్ రేఖారాణికి మాత్రం ఆ బంగ్లా నచ్చక పినాకిని అతిథిగృహంలో ఉంటుంది. ఆమె ఎలాగూ ఆ బంగ్లాకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కమిషనర్‌కు ఆ బంగ్లాను కేటాయించారు. ప్రస్తుతం బంగ్లాకు తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారు.

## ఏ1లో చేర్చండి

నెల్లూరు రైల్వేస్టేషన్‌ను ఏ-1 కేటగిరిలో చేర్చాలని కోరుతూ నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి సదానందగౌడ్‌కు లేఖ వ్రాసారు. జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు ద్వారా రైల్వేకు ఏడాదికి 130కోట్ల ఆదాయం వస్తుందని, నెల్లూరు జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తూ రైల్వే ఆదాయాన్ని పెంచుతున్నారని, నెల్లూరు రైల్వేస్టేషన్‌ను ఏ-1 కేటగిరిలో చేర్చాలని ఆయన కోరారు.



## రెయిన్‌బో స్కూలు వితరణ

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని "రెయిన్‌బో" పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు హుద్‌హుద్ తుఫాను బాధితుల సహాయార్థం 2టన్నుల బియ్యాన్ని సేకరించినట్లు రెయిన్‌బో స్కూలు డైరక్టర్ పద్మా సుబ్రమణ్యం తెలిపారు. ఈ బియ్యాన్ని కావలి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నెల్లూరు శివాజీ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 17న పంపించినట్లు తెలిపారు.

## మళ్ళీ విద్యుత్ కోతలు

నెల్లూరుజిల్లాలో మళ్ళీ విద్యుత్ కోతలు మొదలయ్యాయి. ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో సోమవారం నుంచి విద్యుత్ కోతలు అమలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సూచనల మేరకు జిల్లాలో సోమవారం నుంచి విద్యుత్ కోతలను అమలు చేస్తున్నారు. నెల్లూరు నగరంలో ఒకటిన్నరగంట, పట్టణాల్లో 3గంటలు విద్యుత్‌కోత విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఇ నాగశయనరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు విద్యుత్తు సరఫరా ఇచ్చే సమయాల్లో అంతరాయం ఏర్పడదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పగటిపూట విద్యుత్తుకు అంతరాయం ఉంటుందన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**- శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కొత్త ఇఓ కోదండరామిరెడ్డి**

నెల్లూరు దర్గామిట్టలో వున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి నూతన ఇ.ఓగా పి. కోదండరామిరెడ్డి ఈ నెల 18న బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణ శర్మ స్వాగతం పలికారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆల్తూరి ఆదినారాయణరెడ్డి, ఆలయ పూర్వ కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దొంగపూజారి

దేవుడికి కాపలా కాయాల్సిన పూజారే ఆ దేవుడిని ఎత్తుకెళ్లి అమ్ముకానికి పెట్టాడు. వ్యసనాలకు బానిసలైతే ఎంతటివారైనా ఏ స్థాయికి దిగజారిపోతారనేదానికి ఈ పూజారి సంఘటనే ఓ ఉదాహరణ. నెల్లూరు బొందెలవారి వీధిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో నందిగామ హనుమంత పవన్‌కుమార్ పూజారిగా పనిచేస్తున్నాడు. చెడుసావాసాలు చేసి జూదం, కోడిపందేలు వంటి వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ వ్యసనాలకు రోజూ డబ్బు కావాలి కదా, భక్తులు వేసే కానుకలు ఏ పక్కకు వస్తాయి... ఇంకేముంది పొదలకూరు మండలం మర్రిపల్లికి చెందిన పర్చూరి శ్రీనివాసులు, నెల్లూరు జనశక్తినగర్‌కు చెందిన వెంకటేశ్వర్లుతో పరిచయం పెంచుకున్నాడు. వారిద్వారా తాను రోజూ పూజ చేసే 80ఏళ్లనాటి లక్ష్మణుడి పంచలోహ విగ్రహాన్ని ఎత్తేసాడు. చివరకు పోలీసు నిఘాతో ఈ ముగ్గురూ దొరికిపోయారు. గతంలో ఈ పూజారి అంబాపురంలోని ముత్తుమారియమ్మ గుడిలో పనిచేస్తూ అక్కడి వెండి వస్తువులను తస్కరించాడు. ఈ పూజారిని ఇక ఏ గుడిలో పెట్టుకున్నా ఆ దేవుళ్లకు రక్షణ ఉండదు.

**'ఆన్‌లైన్ పరిష్కారం'**

## రాష్ట్రానికే ఆదర్శం



నెల్లూరు కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తెలుగు సాఫ్ట్‌వేర్‌లో రూపొందించిన "ఆన్‌లైన్ పరిష్కారం" పద్ధతిని చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విధానాన్ని హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో కూడా ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్ర సచివాలయంలోని భూవ్యవహారాలు, సాంఘీక సంక్షేమం, బిసి, ఎస్టీ, మైనార్టీ, స్త్రీ శిశు సంక్షేమశాఖలు, బిసి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, గ్రామీణాభివృద్ధి, పౌరసర ఫరాల శాఖ, మునిసిపాలిటి, హౌసింగ్, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, ఎస్‌పిడిసిఎల్, ఈపిడిసిఎల్ తదితర శాఖల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని సిఎం సూచించారు. దీంతో కాల్‌సెంటర్ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావు రాష్ట్ర సచివాలయంలో "పరిష్కారం" తెలుగు ఆన్‌లైన్ విధానంపై అక్కడి అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ వెళ్ళారు. 3నెలల పాటు ఆయన శిక్షణ ఇవ్వనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నెల్లూరుజిల్లా అధికార యంత్రాంగం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది.

**రవాణామంత్రి పిఎగా**

## సత్యనారాయణ

నెల్లూరు సివిల్ సప్లయిస్ విజిలెన్స్ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణను రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల శాఖ మంత్రి సిద్దా రాఘవరావుకు పిఎగా నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం 18వ తేదీ ఉత్తర్వులు జారీచేసింది.

## చిత్తలో పడిన చినుకు

నిన్న మొన్నటి దాకా కూడా ఎండలు అదరకుమ్మాయి. అక్టోబర్ నెల వచ్చినా ఎండాకాలం ఉన్నట్లుగా అనిపించింది. ఈ నెలలోనే చిత్తకార్తె వచ్చింది. ఈ కార్తె మొదలైన నాలుగురోజులకే వర్షాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఈశాన్య ఋతుపవనాలు కూడా ప్రవేశించడం, బంగాళాఖాతంలో అల్పపీడనాలతో వర్షాలు భారీగానే పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సందడి తగ్గిన దీపావళి

హుద్ హుద్ తుఫాన్ మూలంగా ఈ దీపావళికి సందడి తగ్గింది. నెల్లూరు జిల్లాలో తుఫాన్ రాకపోయినా ఉత్తరాంధ్ర జిల్లాలను ఈ తుఫాన్ కుదిపేసింది. అక్కడి బాధితులకు సంఘీభావంగా నెల్లూరులో చాలామంది దీపావళి జరుపుకోలేదు. దీపావళికి ప్రతి యేటా నెల్లూరొచ్చి పండుగ చేసుకునే కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా దీపావళి పండుగను జరుపుకోవడం లేదని ప్రకటించారు. చాలామంది బాణాసంచాకు పెట్టే డబ్బులను తుఫాన్ బాధితులకు విరాళంగా పంపి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు సైతం బాణాసంచాకు తల్లిదండ్రులిచ్చిన డబ్బును తుఫాన్ బాధితులకు విరాళాలుగా ఇవ్వడం విశేషం.

## రొట్టెల పండుగకు ముస్తాబు



మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరు లోని బారాషహీద్ దర్గా రొట్టెలపండుగ నవంబర్ 4, 5, 6 మరియు 7తేదీలలో జరుగనుంది. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగకు మతాలకతీతంగా భక్తులు వస్తుంటారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండే కాకుండా పాకిస్థాన్, సౌదీఅరేబియా, కువైట్, దుబాయ్ వంటి దేశాల నుండి కూడా భక్తులు వస్తుంటారు. రొట్టెల పండుగ నేపథ్యంలో వివిధ ప్రభుత్వశాఖలు ఏర్పాట్లలో నిమగ్నమై వున్నాయి. దర్గా వద్ద వివిధ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి టెండర్ల ప్రక్రియను ఈసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు.

## నెల్లూరులో బీజేపీ సంబరాలు



మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతాపార్టీ ఘన విజయం సాధించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. నెల్లూరు బీజేపీ కార్యాలయం వద్ద బాణాసంచా వేడుకలతో మోడీ నాయకత్వం వర్ధిల్లాలి, భారతీయ జనతాపార్టీ వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నెల్లూరుజిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డిలు మాట్లాడుతూ మోడీ ఎంచుకున్న ప్రజాసంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతు తెలిపారన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, దళిత మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి బండారు శ్రీనివాసులు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## జేసీ వైఖరిపై నిరసన

న్యాయవాది ఫణిరత్నం పట్ల జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి అమర్యాదగా ప్రవర్తించారని నిరసిస్తూ ఈ నెల 20న నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ నెల 7న జాయింట్‌కలెక్టర్ కోర్టులో తన కేసుకు సంబంధించి న్యాయవాది ఫణిరత్నం వాదనలు వినిపిస్తుండగా జేసీ రేఖారాణి చిన్నగా మాట్లాడాలని వారించారు. దీనికి ఆ లాయర్... తాను అరవడం లేదని వాదన వినిపిస్తున్నానని చెప్పడంతో జేసీ ఆగ్రహిస్తూ 'లీవ్ ది హాల్' అంటూ ఆ లాయర్‌ను ఆదేశించారు. జేసీ వైఖరికి నిరసనగానే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈ నెల 20న విధులు బహిష్కరించి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.రామచంద్రారెడ్డి, కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**తుఫాను బాధితులకు**

## ఎంజి బ్రదర్స్ రూ.10లక్షల విరాళం

ఉత్తరాంధ్రలో హుద్‌హుద్ తుఫానుకు తీవ్రంగా నష్టపోయిన విశాఖపట్నం బాధితులకు ఎంజి బ్రదర్స్ ఎండి ఎంఆర్ గంగాధర్ 18వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విశాఖపట్నంలో రూ.10లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ గతంలో తుఫాను బాధితులకు తనవంతుగా రూ.50లక్షలు వరకు ఎంజి చారిటీస్ నుంచి విరాళాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.



## బాధితుల కోసం ఆర్యవైశ్య సంఘం సరుకులు

విశాఖ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఓ లారీ సరుకులను పంపింది. విశాఖ జిల్లాలోని భీమిలి, గాజువాకలోని సింధియా ప్రాంతాలలో ఎంపికచేసిన 1200 కుటుంబాల వారికి ఈ సరుకులను అందజేయనున్నారు. బాధితుల కోసం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ 4.50లక్షలు, ఐరన్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్ 50వేలు, మెడికల్ షాప్స్ అసోసియేషన్ 23వేలు, జేసీఐ 20వేలు, అర్బన్ ఆర్యవైశ్య మహిళా సంఘం 1200జతల దుస్తులు విరాళంగా ఇచ్చాయి. ఈ లారీని డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ జెండా వూపి పంపించారు.

# రూరల్ రోడ్లను బాగు చేయండి



ఆర్ అండ్ బి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో అధ్వాన్నంగా వున్న పలు గ్రామాల రోడ్లను మరమ్మత్తులు చేసి ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చేయాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్ అండ్ బి ఎస్‌ఇ శేషుకుమార్‌ను కోరారు. ఈ నెల 20న ఎమ్మెల్యే ఆర్ అండ్ బి కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని రోడ్లు సరిగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ములుమూడి, తాడిపత్రిరోడ్డు అధ్వాన్నంగా వుందని, ఈ రోడ్డును వెంటనే బాగు చేయాలని కోరారు. పొదలకూరురోడ్డులో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద వాహనాల వేగం ఎక్కువుగా వుంటుందని, అక్కడ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. మినీబైపాస్, పడారుపల్లి, పెనుబర్తి రోడ్లను పూర్తి చేయాలని కోరారు. గుడిపల్లిపాడు, ఆమంచర్ల సెంటర్‌లలో మెయిన్‌రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

# కరుణించు దేవా...!

## ఆలయ కమిటీల కోసం పైరవీలు

**ఏడాదికి కోటిరూపాయలు ఆదాయం మించిన దేవాలయాలకు కమిటీలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా దేవస్థానాల కమిటీల ఛైర్మెన్, డైరక్టర్ల పదవులకు పోటీ పడుతున్న నాయకులు, కార్యకర్తలలో టెన్షన్ మొదలైంది.**



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో కోటి ఆదాయం దాటిన దేవస్థానాలు ఎనిమిది ఉన్నాయి. వీటిలో నెల్లూరులోని మూలాపేట వేణుగోపాల స్వామి గుడికి వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఉంది. రంగనాథస్వామి దేవస్థానం, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం, జొన్నవాడలోని కామాక్షమ్మ ఆలయం, నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం, తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ దేవస్థానాలకు ట్రస్ట్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ట్రస్ట్‌బోర్డులలో ఛైర్మెన్ పదవుల కోసం ఇప్పటికే తెలుగుదేశం నాయకులు చాలామంది వెంపర్లాడుతున్నారు. ఆయా దేవస్థానాల పరిధిలో అధికారపార్టీ శాసనసభ్యులు లేదా ఆ పార్టీ ఇన్‌ఛార్జ్‌ల మాటే చెల్లుబాటు కానుంది. నెల్లూరులో రంగనాయకుల స్వామి గుడి ఛైర్మెన్ పదవికి పలువురు పోటీ పడుతున్నారు. అయితే ఈ ఛైర్మెన్ పదవి కావాలంటే మంత్రి నారాయణతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిల ఆమోదముద్ర పడాలి. రాజరాజేశ్వరి గుడి ఛైర్మెన్ వంశపారంపర్యంగా వస్తున్నా ట్రస్ట్ బోర్డులో సభ్యులుగా పలువురు ఆశిస్తున్నారు. ఇక పెంచలకోన ఛైర్మెన్ పదవి పూర్తిగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆశీస్సులున్న వారికే లభిస్తుంది. సూళ్లూరుపేట చెంగాళమ్మ ట్రస్ట్‌బోర్డు ఎంపికలో వేనాటి రామచంద్రారెడ్డి, గంగాప్రసాద్‌ల సూచనలకే ప్రాధాన్యముంటుంది. జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం ట్రస్ట్‌బోర్డు ఎంపికలో కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నిర్ణయమే కీలకం. ఈ దేవస్థానాలకు నెలరోజులలోనే ట్రస్ట్‌బోర్డులు ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి.

# ప్రసన్న దేనికీ పనికిరాడు

**- బీద రవిచంద్ర విమర్శ**



వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై విమర్శలు చేయడం తప్ప ఇంకేమీ చేతగాదని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని, ప్రజలను నట్టేట ముంచిన ఘనుడని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ధ్వజమెత్తారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో రవిచంద్ర విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎవరు తగిన వ్యక్తో ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, రుణ మాఫీకి ఎన్ని అడ్డంకులున్నా, ఇబ్బందులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు, మహిళా రుణాలు రద్దు చేసే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. తుఫాను తాకిడితో ఉత్తరాంధ్ర జిల్లాలకు కోలుకోలేని నష్టం వాటిల్లిందని, ప్రత్యేకించి విశాఖపట్నం తీవ్రంగా నష్టపోయిందన్నారు. వారం రోజులుగా సిఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు, అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పునరావాస చర్యలు చేపడుతుంటే ఇవేవి వై.యస్.జగన్‌కు కనపడటం లేదని, ఏదో గ్రామంలో పులిహోర పొట్లాలు అందలేదని చంద్రబాబుపై, ప్రభుత్వ పనితీరుపై చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. రాహుల్‌గాంధీ వస్తున్నారని బొత్స, రఘువీరాలు చీపుర్లు పట్టుకుని షో చేయడం అందరినీ ఆశ్చర్యపరచిందని విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీఎంపి ఉక్కాల రాజేశ్వరమ్మ, పార్టీ నాయకులు అంచల వాణి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెడ్.శివప్రసాద్, నూనె మల్లిఖార్జున యాదవ్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, బద్దెపూడి రవీంద్ర, అన్నం దయాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం



నెల్లూరుజిల్లాలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పనిచేస్తోందని ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. 18వ తేదీ బ్యాంకులోని ఛాంబర్‌లో వివిధ సొసైటీల ఛైర్మెన్లు, బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలోని 99సొసైటీలలో 79సొసైటీలకు కేంద్ర సహకార బ్యాంకు నుంచి, 20సొసైటీలకు ఎస్‌బిఐ నుంచి రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలోని బుచ్చి, వవ్వేరు, ఇందుకూరుపేట, నిడుముసలి, యల్లాయపాళెం సొసైటీలకు 7శాతం వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. ఇటీవల ఎస్‌బిఐ వడ్డీని 13శాతానికి పెంచిందన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందిపడే అవకాశముందని ఆయా సొసైటీలకు కూడా కో-ఆపరేటివ్ బ్యాంకు నుంచి 7శాతానికి రుణాలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో శివరామకృష్ణారెడ్డి, సరిత, ఉషారాణి పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కాంట్ కలదు

బాలల దినోత్సవ కానుక... లాయర్
చిన్నారుల విజయ దీపిక





'పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందును సుమతీ'

... అన్నట్లుగా బిడ్డ జన్మించినప్పటికంటే, ఆ బిడ్డ ప్రతిభతో రాణించి అందరి ప్రశంసలందుకున్నప్పుడు ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులే వుండవు. కంటి పాపల్లాంటి మీ ఇంటి పాపాయిలు సాధించిన ఘనతలను, సాధిస్తున్న ఘన విజయాలను సమాజానికి తెలియజేసి వారికి సముచితమైన గౌరవాన్ని, మరింత ప్రోత్సాహాన్ని అందించాలని సంకల్పించింది మా(మీ) లాయర్.మన జిల్లాలో బాల మేధావులు, బాల కళాకారులు ఎందరో వున్నారు. అదేవిధంగా, క్రీడా రంగంలోనూ, వివిధ కళారూపాల ప్రదర్శనల్లోనూ, మేటిగా.. ధీటుగా వున్నవారూ.. అత్యద్భుతమైన మేధస్సుతో పిల్లలు కాదు.. పిడుగులన్నట్లుగా రాణిస్తున్నవారూ ఎందరో వున్నారు. నాట్యంలోనూ, గానంలోనూ, సంగీతంలోనూ.. చిత్రలేఖనంలోనూ... ఇలా ఎన్నో రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను చాటుకుంటూ సింహపురి కీర్తిబావుటాను రెపరెపలాడిస్తున్న చిన్నారులు అనేకమంది వున్నారు. అలాంటివారి ప్రతిభకు దర్పణంగా.. చిన్నారులందరికీ తీపి జ్ఞాపికగా వుండేలా ఒకప్రత్యేక అనుబంధాన్ని.. రంగుల గ్రంథంగా అందించేందుకు లాయర్ వారపత్రిక సంసిద్ధమైంది. ఈ బాలల దినోత్సవం (నవంబరు14, 2014) నాడు సింహపురి చిన్నారిలోకానికి చిరుకానుకగా... అందరూ పది కాలాల పాటు పదిలపరచుకునే విధంగా.. సర్వాంగసుందరంగా.. లాయర్ 'చిన్నారుల విజయదీపిక'ను రూపొందిస్తోంది. అందుకు మీ అందరి సహకారాన్ని కోరుతున్నాం.. మీ చల్లని దీవెనలను ఆకాంక్షిస్తున్నాం. 'రేపటి తరం' ప్రతిభా విశేషాలను నేటితరం వారికి తెలియజెప్పడానికి లాయర్ చేస్తున్న ఈ బృహత్తర కృషిలో మీ అందరూ భాగస్వాములు కావాలని మనసారా కోరుతున్నాం. ఆయా రంగాల్లో మీ చిన్నారులు చేస్తున్న కృషిని, వారు సాధించిన బహుమతులు, పొందిన బిరుదులూ, ప్రశంసలూ వగైరా వివరాలన్నిటినీ వీలైనంత క్లుప్తంగా, బాగా అర్ధమయ్యేలా రాసి, చిన్నారుల ప్రతిభా వివరాలతో పాటు సంబంధిత ఫోటోలను జతచేసి, మీ చిన్నారి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను, మీ చిరునామా, ఫోన్ నంబరుతో పాటు, మీ చిన్నారి చదువుకుంటున్న పాఠశాల పేరు, ఆయా రంగాల్లో ప్రోత్సాహం అందిస్తున్న గురువుల పేర్లు కూడా జతపరచి మాకు పంపవలసిందిగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకూ, ఆయా పాఠశాలల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. వీలైనంత ఎక్కువమంది చిన్నారులకు వేదికగా వుండేందుకు, వీలైనంత సంక్షిప్తంగా ఆ వివరాలను పంపగలరని కోరుతున్నాం. ఎల్‌కెజి నుంచి 10వ తరగతి దాకా చదువుకునే మీ చిన్నారుల ప్రతిభా విశేషాలను మాత్రమే మాకు తెలియజేయండి.

వెంటనే ఆ వివరాలు మాకు చేరేలా రాసి పంపగలరని కోరుతున్నాం!..

చిరునామా: 'విజయ దీపిక', లాయర్ వార పత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు - 524 003. ఫోన్: 0861 - 2323485. సెల్: 98663 14741.

# ప్రజలలో చైతన్యం నింపుతున్న 'స్వచ్ఛభారత్'



**ఒక మంచి ఆలోచనను పదిమంది ఆచరిస్తే ఎంతటి సత్ఫలితాలుంటాయో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన 'స్వచ్ఛభారత్' పిలుపు ప్రజల్లో ఒక మంత్రంగా పని చేస్తుంది. ఈ కార్యక్రమం పట్ల ప్రతిఒక్కరూ ఆకర్షితులవుతున్నారు. కాఫీ షాపుల్లో కబుర్లు చెప్పుకునే సమయం, పార్కులలో బాతాఖానీ కొట్టే కాలాన్ని, ఎదురింటి ఎల్లమ్మ, పక్కింటి పుల్లమ్మలతో ఉబుసుపోని మాటలు చెప్పుకునే సమయాన్ని తమ పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కేటాయిస్తే... స్వచ్ఛభారత్ మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది.**

స్వచ్ఛభారత్ కార్యక్రమం నెల్లూరు నగరంలో సైతం ప్రజలను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. యువకులు, ఉద్యోగులే కాకుండా మహిళలు, పిల్లలు, వృద్ధులు సైతం ఈ కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతిఒక్కరు కూడా తాము నివసించే పరిసర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నారు. ప్రతిరోజూ ఓ గంట లేదంటే వారంలో నాలుగైదు గంటల సమయాన్ని పరిశుభ్రతకు కేటాయిస్తున్నారు. తమ పరిసరాలలో ఉండే చెత్తను ఏరేయడం, కంపను తొలగించడం, మురికి నీళ్లు లేకుండా చేయడం వంటి వాటిపై దృష్టి పెడుతున్నారు.

'స్వచ్ఛభారత్'ను ఆదర్శంగా తీసుకుని ముగ్గురు రిటైర్డ్‌లెక్చరర్స్ ఎంతో అపరిశుభ్రంగా వున్న తమ ప్రాంతాలకే కొత్తరూపు తెచ్చారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని లెక్చరర్స్ కాలనీలో నరసింహారెడ్డి, శంకరయ్య, దశరథ రామయ్యలు నివసిస్తున్నారు. వీరు విశ్రాంత అధ్యాపకులే! వీరి నివాసాల పక్కనే ఖాళీ ప్లాట్లు ఉండేవి. ఈ ప్లాట్లలోకి మురుగునీరు చేరడంతో పాటు దట్టంగా పెరిగిన కంపచెట్లతో ఈ ప్రాంతం ఓ చిట్టడివిలా ఉండేది. ఈ ప్లాట్లలో చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచమని వీరు ఎన్నిసార్లు స్థలాల యజమానులకు విన్నవించుకున్నా లాభం లేకుండా పోయింది. ఈ ఖాళీ ప్లాట్లలో చెట్లు పెరిగి మురికి మడుగులు కట్టి పందులు, దోమలు, పాములకు ఆవాసాలుగా మారాయి. మోడీ 'స్వచ్ఛభారత్' పిలుపుతో స్పందించిన ఈ ముగ్గురు లెక్చరర్స్ తమ ప్రాంత బాగుకోసం తామే నడుంకట్టారు. వయసు మీద పడ్డా లెక్కచేయకుండా తెల్లారుజామున 5.30గంటలకే పలుగుపార చేత పట్టి రంగంలోకి దిగేవాళ్లు. గత కొన్నిరోజులుగా వారి దైనందిన చర్య ఇదే! ఉదయాన్నే రెండుగంటల పాటు కష్టపడతారు. తమ పరిసరాలను ఇప్పటికే పరిశుభ్రంగా మలచి రోడ్డు పక్కన గ్రావెల్ తోలించి మొక్కలు కూడా నాటించారు. ప్రతిరోజూ వాకింగ్ చేసే సమయాన్ని వారు స్వచ్ఛ భారత్‌కు కేటాయించి తమకు శాపంగా మారిన తమ పరిసరాలను ఎంతో పరిశుభ్రంగా మార్చుకున్నారు. వీరి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ పనిచేస్తే అన్ని ప్రాంతాలు క్లీన్ అండ్ గ్రీన్ కావడం ఖాయం.

## గూడూరు డివిజన్ వార్తలు

### అమరవీరుల స్మారక ర్యాలీ



గూడూరులో మంగళవారం అమరవీరుల స్మారకదినోత్సవం సందర్భంగా పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ భూషణం మాట్లాడుతూ వేలాదిమంది పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. పట్టణంలోని పురవీధుల్లో పోలీసులతో పాటు పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. పోలీసుల త్యాగాలు మరవలేనివన్నారు. నేరాలు అదుపు చేసేందుకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాబి, అజయ్‌కుమార్, నారాయణరెడ్డి, హనీఫ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తుఫాను బాధితులకు చేయూత



విశాఖపట్నం వెళ్లే సరకుల లారీ వద్ద ఎమ్మెల్యే సునీల్, ఛైర్‌పర్సన్ దేవసేన

దాతలు స్పందించి విరివిగా విరాళాలు అందజేస్తే తుఫాను బాధితులకు కొండంత అండ ఇచ్చినవారవుతామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని హైస్కూల్‌రోడ్డులో ఉన్న పురపాలక సంఘ కౌన్సిల్‌హాలులో ఆదివారం కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దాతలకు కొదవలేదని, అందరూ పెద్దమనస్సుతో ముందుకొచ్చి తమకు తోచిన విధంగా సాయం అందించాలన్నారు. విశాఖపట్నంలో తుఫాను తాకిడికి దెబ్బతిన్న కాలనీని దత్తత తీసుకుని పునర్నిర్మాణం చేసేందుకు అందరూ అండగా నిలవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రభుత్వం అధిక ప్రాణ నష్టం జరగకుండా చొరవచూపిందన్నారు. పార్టీలు, మతాలకతీతంగా తుఫాను బాధితులకు సాయం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ సంస్థ నుంచి సేకరించిన రూ. 1.50లక్షల విలువైన మందులు, రెడ్‌క్రాస్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు సేకరించిన బియ్యం, ఫలసరుకులు, రూ.20వేల నగదు అందజేశారు. హిజ్రాలు దాదాపు 300కేజీల బియ్యం, దుస్తులను మై ఫ్రెండ్స్, స్వాంతన సేవాసంస్థల ప్రతినిధులకు అందజేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి విశాఖపట్నానికి సరకులను తీసుకెళ్లే లారీని ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్‌లు ప్రారంభించారు. అలాగే ఆడిటర్ ఎస్.రామమోహన రావు రూ. 80వేలు ఆర్థికసాయం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అంతకుముందు కౌన్సిల్‌హాలులో తుఫాను మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైకాపా కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పుట్టంరాజువారి కండ్రిగలో 60రోజుల్లో పనులు పూర్తి

- జిల్లా కలెక్టర్ శ్రీకాంత్



పుట్టంరాజువారి కండ్రిగను ఎంపి సచిన్ దత్తత తీసుకున్న విషయంపై నేటికీ ఎలాంటి అధికారిక సమాచారం లేదని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. సోమవారమిక్కడ ఆయన ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. గ్రామాన్ని స్వర్ణ(ఆదర్శ) గ్రామంగా ఇప్పటికే ప్రకటించిన కలెక్టర్, తాజాగా పనుల నిర్వహణ తీరుపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. తొలుత గ్రామానికి ఉపయోగించే రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామానికంతటికి ఎలా వినియోగిస్తున్నారు, ఇళ్ల నిర్మాణాలెలా ఉన్నాయి, పాడిపరిశ్రమున్న వారు చెత్త, పేడను ఎక్కడవేస్తున్నారు. ప్రస్తుతం వర్షపునీరు ఎలాపోతోంది, శ్మశానం దారి, తదితర విషయాలపై గ్రామస్థులతో దాదాపు నాలుగు గంటల పాటు మాట్లాడారు. అన్నీ వీధుల్లో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇళ్లు, ఇతర సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవిదేశాల్లోని మౌలిక వసతులకు ధీటుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆధునిక మౌలిక వసతులతో స్వర్ణ(ఆదర్శ) గ్రామంగా పుట్టంరాజువారి కండ్రిగను తీర్చిదిద్దే క్రమంలో పరిశీలిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ నిధుల ద్వారా రూ. 3కోట్లతో స్వర్ణగ్రామంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఆధునిక భూగర్భడ్రైనేజీ, పక్కారోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం, ఇంటింటికి తాగునీటి సరఫరా సామూహికంగా చెత్తవేయడానికి గుంతలు, 24గంటలు విద్యుత్ సౌకర్యం, ఆధునిక శ్మశానం, కాలనీల్లో మురుగుదొడ్లు నిర్మాణం, రోడ్లు, సామాజిక భవనాలను నిర్మిస్తున్నట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### తుఫాను బాధితులకు వరిదిరెడ్డి సుబ్బారెడ్డి విరాళం



విశాఖపట్నంలోని తుఫాను బాధితుల సహాయార్థం పట్టణవాసి వరిదిరెడ్డి సుబ్బారెడ్డి రూ. 25వేలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఛైర్‌పర్సన్ పొనకాదేవసేనను సోమవారం ఆమె కార్యాలయంలో కలిసి చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో దాతలకు కొదవలేదని, అందరూ సుబ్బారెడ్డిలా స్పందించాలని కోరారు. బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనురాధ, కౌన్సిలర్లు రమేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### రక్షణ కల్పించండి

డిఎస్పీకి మహిళల వినతి



గాంధీనగర్ ప్రాంతంలో మద్యం దుకాణం ఎత్తివేయాలంటూ గతంలో ధర్నా చేశామని, దీంతో తమపై అక్రమంగా కేసులు బనాయించారని సుజాతమ్మ, లక్ష్మమ్మ, గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ధర్నా చేసినందుకు కేసులు నమోదు చేయడంతో తాము దక్కిలి తహశీల్దార్ కార్యాలయంలో హాజరవుతున్నామని, కాని వెళ్లేటప్పుడు మద్యం దుకాణాలకు సంబంధించి స్థానికంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు తమను బెదిరిస్తున్నారని, దీంతో భయాందోళన చెందుతున్నామని వివరించారు. తమకు న్యాయం చేయాలని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికపరమైన నిర్ణయాలలో కుటుంబసభ్యుల సహకారం తీసికొనండి. వ్యాపార వృత్తి నిర్వహణలో కొద్దిపాటి ఇబ్బందులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. బంధువులతో ఇబ్బందులు, పేచీలు రాకుండా జాగ్రత్తపడండి. పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపాలి. ఉద్యోగులు ఆటంకాలను అధిగమిస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపార సమస్యలు, ఆర్థిక సమస్యలు తొలగి అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. పనులందు టెన్షన్ ఉండినా నెరవేర్చుకొంటారు. బంధు మిత్రుల ఆకస్మిక రాక సంతోషాన్ని కలిగిస్తుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, శుభకార్యాల నిర్ణయ చర్చలు జరుగుతాయి. కొత్త వస్తువులను ఇంటికి సమకూర్చుకొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలలో చిన్న సమస్యలుండినా సరిజేసి కొంటూ ముందుకు సాగుతారు. ఆర్థికముగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులకు ఆటంకాలు, ప్రభుత్వ అనుమతులందు ఆలస్య ముంటుంది. సంస్థల యజమానులకు వర్కర్లతో సమస్యలు వస్తాయి. షేర్ మార్కెట్ నిరుత్సాహ పరుస్తుంది. రావలసిన బాకీలను సున్నితంగా వసూలు చేయండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

తలపెట్టిన పనులకు ఆటంకాలు వచ్చి చికాకు పడుతుంటారు. అదనపు ఖర్చులు పెరిగిపోతాయి. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. వృత్తి ఉపాధి రంగాలవారికి సామాన్య ఆదాయముంటుంది. మిత్రులు, బంధువుల సహకారం బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. స్టాక్‌మార్కెట్ నిరుత్సాహపరుస్తుంది.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 24.10.2014 నుండి
తేది. 30.10.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో బుధ రాహువులు, తులలో రవి శని శుక్రులు, ధనుస్సులో కుజుడు, తుల వృశ్చిక ధనుస్సు రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 27 సోమవారము నాగులచవితి
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

**కార్తీక మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | పాడ్యమి | రా॥గం.3.20ని॥ |
| తేది. 25 | శని | విదియ | రా॥గం.3.11ని॥ |
| తేది. 26 | ఆది | తదియ | రా॥గం.2.40ని॥ |
| తేది. 27 | సోమ | చతుర్థి | రా॥గం.1.33ని॥ |
| తేది. 28 | మంగళ | పంచమి | రా॥గం.12.10ని॥ |
| తేది. 29 | బుధ | షష్ఠి | రా॥గం.10.20ని॥ |
| తేది. 30 | గురు | సప్తమి | రా॥గం.8.17ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికపరమైన వ్యవహారాలలో సలహాలు పొందుతారు. వృత్తి వ్యాపార వర్గాల వారికి ఆదాయం సంతృప్తికరం. అయితే ఖర్చులు కూడా అదనంగానే ఉంటాయి. నిర్మాణాలు, కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూలంగా ఉంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగార్థులకు అనుకూల పరిస్థితులుంటాయి.

## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయము, ఖర్చు ఫరవాలేదనిపించగలవు. ఉద్యోగులకు పని వత్తిడి, పర్యటనలు తప్పనిసరి. వ్యాపార విస్తరణ అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. స్థిరాస్తుల పై ఆదాయం, షేర్లపై లాభాలుంటాయి. చేపట్టిన పనులు విజయవంతం కాగలవు. ప్రయాణాలు లాభసాటి కాగలవు. శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. తొందరపాటు మాటలను చేష్టలను తగ్గించుకొనండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

భూములు, స్థలాలు యొక్క క్రయవిక్రయ వ్యవహారాలు జరుగక నిలబడవచ్చును. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. అనుకోని ఖర్చులు పైనబడగలవు. తలపెట్టిన పనులు సులువుగా జరుగుతాయి. ఉద్యోగార్థులు శుభవార్తలు వినే అవకాశం ఉన్నది. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు ఇబ్బందులుంటాయి. అధికారులకు విధినిర్వహణలో గుర్తింపు గౌరవాలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకోని అదనపు ఖర్చులుండినా సర్దుబాటు అగును. మానసికంగా కుదుటపడతారు. అనుకున్న పనులను అనుకూలంగా నెరవేర్చుకొంటారు. ఆర్థికపరమైన ఇబ్బందులను అధిగమిస్తారు. సోదరుల కుటుంబానికి మేలు జరుగుతుంది. చిన్నచిన్న గాయాలు తగలవచ్చు. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలుంటాయి. షేర్లు సామాన్య లాభాలనిస్తాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించండి. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల విషయాలలో తొందర పాటు వద్దు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, ఒక మోస్తరు ఆదాయముంటుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించాలి. తలపెట్టిన పనులు జరుపుకొనడానికి శ్రమపడాల్సి ఉంటుంది. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. కుటుంబంలో కొద్దిపాటి భేదాభిప్రాయాలు తలెత్త గలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబసభ్యుల అవసరాలకు, కోరికలకు ఖర్చులు పెరుగుతాయి. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారులకు ప్రయాణాలుంటాయి. కొత్త ఋణాలు లభించగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త పెట్టుబడులకు అనుకూలం.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసికొనలేక సతమతమౌతారు. ఓర్పుతో పనులను, సమస్యలను పరిష్కరించుకొనడం వల్ల మేలు జరుగుతుంది. వ్యాపారులు, ఉద్యోగులపై అధికారుల వత్తిడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలకు సహాయపడతారు. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. పెద్ద పెట్టుబడులు, సంస్థల విస్తరణ ప్రయత్నాలను ప్రస్తుతానికి నిలపండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు. అందరితోను కలుపుకొనిపోయే విధంగా ప్రవర్తించండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, ఆదాయముంటుంది. బంధుమిత్రుల సూటిపోటి మాటలు బాధపెడతాయి. ఉద్యోగ వర్గాలకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. ఆత్మీయులు సహాయం చేస్తారు.

# గ్రామాల్లో కక్షలు లేకుండా చూస్తా!

**నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

కక్షలు, కార్పణ్యాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం అవసరమని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 18వతేదీ ములుమూడి, దేవరపాలెం గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ తగాదాల వల్ల ప్రశాంతత కరువై కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని, దీంతో గ్రామాభివృద్ధి ఆగిపోతుందన్నారు. చిన్నచిన్న తగాదాలు వచ్చినప్పుడు గ్రామంలోనే పరిష్కరించుకోవాలన్నారు. ములుమూడిలో ఏ ఒక్కరూ పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా ఉండేందుకు పార్టీలకతీతంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకుడు చాట్ల నరసింహారావు, సిపిఐ నాయకుడు పముజుల దశరథరామయ్య పాల్గొన్నారు.

# రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు

నెల్లూరు దర్గామిట్టలోని పవిత్రమైన బారాషాహిద్ దర్గాలో నవంబరు 4వ తేది నుంచి వైభవంగా ప్రారంభం కానున్న రొట్టెల పండుగ కోసం భక్తులు లక్షలాదిగా తరలివస్తారు కనుక, భక్తులకు సౌకర్యవంతంగా వుండేలా రొట్టెల పండుగ ఏర్పాట్లను మరింత పటిష్టంగా చేయాలని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అధికారులకు సూచించారు. ఈ నెల 18న ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో రొట్టెల పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రొట్టెల పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. భక్తులకు ఎలాంటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ వైద్యాధికారి వెంకటరమణయ్యతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### కావలి నుండి విశాఖకు...
# రెడ్‌క్రాస్ బృందం

హుద్‌హుద్ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు కావలి రెడ్‌క్రాస్ బృందం సరుకుల లారీతో సోమవారం విశాఖజిల్లాకు వెళ్లింది. కావలి ఆర్డీవో యం.లక్ష్మీనరసింహం జెండా ఊపి ఈ లారీని పంపించారు. 15కిలోల బియ్యం, ఒక కిలో చెక్కెర, అరకిలో కందిపప్పు, కిలో పప్పు, కిలో వంటనూనెలతో 500కిట్లను రెడ్‌క్రాస్ సభ్యులు తయారు చేశారు. రెడ్‌క్రాస్‌సభ్యులు 5రోజులలో కావలిలో తిరిగి 7.5టన్నుల బియ్యం, ఇతర సరుకులను సేకరించగలిగారు. వాటితోనే కిట్లను తయారు చేశారు. ఈ సరుకులతో 10మంది రెడ్‌క్రాస్ సభ్యులు విశాఖకు బయల్దేరి వెళ్లారు.

# 'దేశం' నేతల వితరణ

**- రూ. 15 లక్షల విలువైన సరుకుల అందజేత**



విశాఖ తుఫాన్ బాధితులను ఆదుకునే కర్తవ్యంలో భాగంగా నారా లోకేష్ పిలుపు మేరకు తమ ఆధ్వర్యంలో రెండువేల కుటుంబాలకు సరిపడా రూ. 15 లక్షల విలువైన సరకులను అందజేస్తున్నామని నారా లోకేష్ సేవాసమితి జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. 10టన్నుల కూరగాయలు, 10 టన్నుల బియ్యం, మరో 10టన్నుల మంచి నీటి ప్యాకెట్లు, ఉప్పు వగైరాలను విశాఖ బాధితులకు అందజేసేందుకు తీసుకువెళ్తున్నామన్నారు. అంతేకాక, తనవంతు సహాయంగా లక్ష రూపాయలను కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆ సరుకులను రెండు లారీల్లో తీసుకువెళ్తున్నామన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు బీద రవిచంద్ర పార్టీ కార్యాలయం వద్ద ఆ లారీలకు పచ్చజెండా వూపారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ తుఫాన్ తాకిడికి విశాఖతో పాటు, ఉత్తరాంధ్రలోని మరోమూడు జిల్లాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. బాధితులను ఆదుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు, అధికారులు అందరూ తుఫాన్‌బాధిత ప్రాంతాల్లో నిర్విరామంగా పర్యటిస్తూ, అక్కడి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, అయితే ప్రతిపక్ష నాయకులు బాధితులకు చేసిందేమీ లేకపోయినా, ముఖ్యమంత్రిపై లేనిపోని విమర్శలు చేయడం దారుణమన్నారు. తుఫాన్ ధాటికి తీవ్రంగా నష్టపోయిన విశాఖకు పూర్వ వైభవం తీసుకురావాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నారా లోకేష్ సేవా సమితి అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మల్లి కార్జునరెడ్డి, కరణం రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు పొన్నవోలు విజయ్‌కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తాళ్లపాక అనూరాధ, రమేష్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, జడ్ శివప్రసాద్, మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ బాధితులకు కూరగాయలు

హుద్‌హుద్ తుఫానుతో దెబ్బతిన్న విశాఖపట్నం జిల్లాకు నెల్లూరు ఏసి కూరగాయల మార్కెట్ నుంచి తక్కువ ధరలకు కూరగాయలు సరఫరా చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల నుంచి కూరగాయలు కొనుగోలు చేసి విశాఖపట్నంకు తరలించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. సోమవారం 15 టన్నుల కూరగాయలను లారీలో విశాఖకు పంపించారు. మార్కెటింగ్ ఏ.డి అనిత కుమారి పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుత ఫలితాలు

సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో అత్యద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, భవిష్యత్తులో ప్రతి అంశం సాంకేతిక పరిజ్ఞానంతోనే ముడిపడివుంటుందని, అందువల్ల ప్రతి విద్యార్థి ఆ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రాణించాలని వైద్య విద్య అదనపు సంచాలకులు వెంకటేష్ అన్నారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి వైద్యకళాశాలలో ఈ నెల 18న జరిగిన ఫ్రెషర్స్‌డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వత్తిడితో కూడిన విద్య వల్ల పెద్దగా ప్రయోజనం వుండదని, స్వేచ్ఛాయుత వాతావరణంలో శ్రద్ధతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. మనం ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా, కన్న తల్లిదండ్రులను విస్మరించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకరరావు మాట్లాడుతూ, సమిష్టి కృషితోనే ఉన్నత ఫలితాలు సాధ్యమన్నారు. వైద్య కళాశాల స్థాపనతో నెల్లూరీయుల కల సాకారమైందన్నారు. ఈ సందర్భంగా కళాశాల లోగోను, వెబ్‌సైట్‌ను వారు ఆవిష్కరించారు. క్రీడల్లో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

# తీర్థ చిల్డ్రన్స్ హోం స్కూలులో దీపావళి వేడుకలు




నెల్లూరు నగరం మనుమసిద్దినగర్‌లో ఉన్న తీర్థ చిల్డ్రన్స్ హోం స్కూలులో బుధవారం నరకచతుర్దశి, దీపావళి పండుగ సందర్భంగా విద్యార్థులు దీపాలు వెలిగించి టపాసులు కాల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. స్కూలు కరస్పాండెంట్ యం.ద్వారకానాథ్, ప్రిన్సిపాల్ యం.సాయికుమారి, స్కూలు ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ పండుగల్లో పిల్లలకు ఇష్టమైన పండుగ దీపావళి పండుగని, త్రేతాయుగంలో శ్రీరాముడు అరణ్యవాసం అయిన తర్వాత పట్టాభిషేకం జరిగినప్పుడు దీపావళి జరుపుకున్నారని, ద్వాపర యుగంలో సత్యభామ, నరకాసురుడను రాక్షసుడ్ని సంహరించినందువల్ల ద్వాపరంలో దీపావళి జరుపుకున్నారని పురాణాలు చెబుతున్నాయని విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు దీపావళి అంశంపై ఉపన్యాసాలు, పాటలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

# మోహన్‌బాబుకు బెగోరె పురస్కారం

(5వపేజీ తరువాయి)

ఓ విశిష్టత వుందని, ఈ అవార్డునందుకుంటున్న మోహన్‌బాబుకు ఓ ప్రత్యేకత ఉంద న్నారు. ఇరువురూ రాజకీయ రంగంతో పాటు కళారంగంలో ప్రవేశమున్నవారేనని చెప్పారు. కష్టం, క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదిగిన మోహన్‌బాబుకు ఈ అవార్డునివ్వడం సముచితమన్నారు.

***గోపాలరెడ్డి కుటుంబంతో దశాబ్దాల అనుబంధం మరువలేనిది***

*– శివప్రభాత్‌రెడ్డి*

'లాయర్' వార పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ 1994లో బెజవాడ గోపాలరెడ్డి గారితో పరిచయం ఏర్పడిందని, 1996లో ఆయన 90వ జన్మదినాన 'బ్రతుకంతా బృందావనమే' పేరుతో ప్రత్యేకసంచికను విడుదల చేశామన్నారు. ఆయన మరణం తర్వాత 1997లో ఆయన స్వీయచరిత్ర మొదటి ముద్రణను తామే రూపొందించామని, 2007లో బెజవాడ గోపాలరెడ్డి విగ్రహాన్ని నెలకొల్పే బాధ్యతలు తనకే దక్కాయని, అలాగే ఈరోజు ఆధునీకరించబడ్డ ఆయన 'స్వీయ చరిత్ర' ద్వితీయ ముద్రణను రూపొందించే అవకాశం తనకే రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన మాగుంట పార్వతమ్మకు ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు.

కొణిజేటి రోశయ్యతో పాటు ఇతర అతిథులందరూ కలసి జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం శ్రీమతి బాలార్క ప్రార్థనతో సభ మొదలైంది.

సభకు మోహన్‌బాబు గురువు దాసరి నారాయణరావు అనివార్య కారణాలవల్ల రాలేకపోయారు. సభా కార్యక్రమానికి ముందు గురుకృప కళాక్షేత్రం, ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

తన గంభీర వ్యాఖ్యానంతో ఏకపాత్రాభినయం చేసి కార్యక్రమాన్ని మొత్తం బి.వి. నరసింహం అంతా తానేయ్యి నిర్వహించాడు. కొండా బలరామిరెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## కాలధర్మం

# కంచి సుబ్బరత్నమ్మ



నెల్లూరు సెంట్రల్ స్కూల్ మాజీ కరస్పాండెంట్ కంచి సురేంద్రరావు మాతృమూర్తి కంచి సుబ్బరత్నమ్మ అక్టోబర్ 19వ తేదీ ఆదివారం చెన్నైలో కన్ను మూశారు. ఆమె వయస్సు 93 సంవత్సరాలు. ఆమెకు నలుగురు కుమారులు కాగా పెద్ద కుమారుడు కె.యస్.రావుగా నెల్లూరీయులకు చిరపరిచితుడే. ముత్తుకూరు రోడ్డులోని నెల్లూరు సెంట్రల్ స్కూల్ అంటే ఒకప్పుడు జిల్లాలోనే తెలియనివారు లేరు. విద్యారంగంలో వచ్చిన పెనుమార్పులతో పాటు సెంట్రల్ సిలబస్‌కు ప్రాధాన్యత తగ్గడం, అనారోగ్య వాతావరణంలో పోటీతత్వం ఏర్పడడంతో కె.యస్.రావు సెంట్రల్ స్కూల్‌కి గుడ్‌బై చెప్పి నిర్మాణరంగం వైపు వెళ్ళిపోయాడు.

సుబ్బరత్నమ్మ రెండవ కుమారుడు సుబ్రహ్మణ్యం నాయుడుని కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్న తరుణంలో 1990వ దశకంలో ఇన్‌ఫార్మర్ అన్న నెపంతో నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారు. 3వ కుమారుడు కంచి సుధాకర్ అమెరికాలో స్థిరపడగా 4వ కుమారుడు ప్రకాష్ వ్యాపారవేత్తగా నెల్లూరులోనే వుంటున్నాడు.

సుబ్బరత్నమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో వుంటూ గత ఆదివారం చెన్నైలో తన పెద్దకుమారుడి వద్ద తుదిశ్వాస విడిచింది. ఆమె ఆత్మకు శాంతిని, వారి కుటుంబసభ్యులకు మనోస్థైర్యాన్ని కలగజేయాలని భగవంతుని కోరుకుంటూ ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# వికలాంగుల మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

లయన్స్ క్లబ్, నెల్లూరు మరియు కేంద్ర కృత్రిమ అవయవాల పంపిణీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నెల్లూరు పురమందిరం ప్రాంగణంలో భారీ ఉచిత వికలాంగుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వికలాంగులకు శాశ్వ తంగా ఉపయోగపడే పరికరాలను అంద జేయడం కోసం ముందుగానే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయడంతో ఈ శిబిరానికి వెయ్యి మందికి పైగా విక లాంగులు తరలివచ్చారు. కేంద్ర కృత్రిమ అవయవాల సంస్థ ప్రతినిధిగా వచ్చిన సమాల్ ఈ శిబిరానికి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహ రించారు. అలాగే నారాయణ ఆసుపత్రి, సింహపురి ఆసుపత్రి వైద్య సిబ్బంది వికలాంగులను పరిశీలించి కృత్రిమ అవయవాల కొలతలు తీసుకున్నారు. ఈ శిబిరంలో మొత్తం 340 మంది చెవిటి వారిని, 357మంది శారీరక వికలాంగు లను, 20మంది మానసిక వికలాంగులను,



65మంది కృత్రిమ అవయవాలు అవసర మైన వారిని గుర్తించారు. 45రోజుల్లోపు వీరికి అవసరమైన పరికరాలను, కృత్రిమ అవయవాలను, వీల్‌ఛైర్స్, ట్రైసైకిళ్ళ వంటి వాటిని అందజేయనున్నారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి క్లబ్ అధ్యక్షులు కృష్ణమోహన్ మాట్లాడుతూ వికలాంగులను ఆదు కోవడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్య తగా గుర్తించాలన్నారు. తమ క్లబ్ ద్వారా ఇకముందు కూడా మరిన్ని వైద్యశిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ రాజశేఖర్ ఈ శిబిరాన్ని సందర్శించి లయన్స్‌క్లబ్ సభ్యు లను అభినందించారు. క్లబ్ కార్యదర్శి యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్ శిబిరాన్ని పర్యవేక్షించారు. లయన్స్ గవర్నర్ శ్రీమతి వై.అమృతవల్లి, కోశాధికారి సహజానంద రెడ్డి, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎడిషన్లు మూసేస్తున్నాయి..!

(మొదటిపేజీ తరువాయి)

పరిచయమయ్యాయి. కాలక్రమేణా మారు తున్న పరిస్థితుల కనుగుణంగా అనేక పత్రికలు ఒక్కొక్కటిగా మూలబడుతూ వస్తుండగా ఆంధ్రప్రత్రిక రెండు దశాబ్దాల క్రితం వరకూ వచ్చి ఆగిపోగా ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలు ఇంకా తెలుగు పాఠకులను పలుకరిస్తూనే వున్నాయి. 1945లో ప్రారంభింపబడిన ఆంధ్రజ్యోతి మధ్యలో కొంతకాలం ఆగి పోయినా తిరిగి తన వెలుగులు విర జిమ్ముతోంది.

1974లో మూడువేల కాపీలతో మొట్టమొదటిసారిగా విశాఖతీరం నుండి ప్రారంభమైన ఈనాడు దినపత్రిక పత్రికా ప్రపంచంలోనే పెనుమార్పులను తీసుకొ చ్చింది. ఎక్కువశాతం గ్రాంధికం వాడు తున్న రోజుల్లో వ్యవహారిక భాషకు ప్రాధా న్యత కల్పించడమే కాకుండా నలువు తెలువుల నుండి రంగుల సామ్రాజ్యానికి పత్రికారంగాన్ని తీసుకెళ్ళి ఎన్నో పత్రికలకు మార్గదర్శిగా నిలిచింది. ఈనాడు పోకడ ఒక్కోసారి విపరీత ధోరణిగా అనిపించినా "వింటే భారతం వినాలి.. చదివితే ఈనాడు చదవాలి" అనే స్థాయికి వచ్చేలా తన ప్రభావాన్ని పాఠకుడిపై పడేలా చేసుకోగలిగింది.

1989వ సంవత్సరంలో జిల్లా ఎడి షన్ల పేరుతో టాబ్లాయిడ్‌లను ప్రారంభించి పత్రికను క్రమేణా రాష్ట్రస్థాయి నుండి జిల్లా స్థాయికి జిల్లా స్థాయి నుండి నియోజక వర్గం స్థాయికి, నియోజకవర్గం స్థాయి నుండి, మండల స్థాయికి, మండల స్థాయి నుండి గ్రామస్థాయికి, గ్రామస్థాయి నుండి వీధి స్థాయికి తీసుకొచ్చేసింది. ఒక వీధిలో జరిగే విశేషం ఇంకొక వీధిలోని వారికి తెలియనంత స్థాయికి జర్నలిజాన్ని మార్చే సింది. ఈనాడు ధాటికి తట్టుకుని నిల బడడం సామాన్య యాజమాన్యానికే కాక అంగబలం అర్థబలంతో అతి ఆర్భాటంగా ఉదయం, వార్త పత్రికలు ప్రారంభించిన దాసరి నారాయణరావు, గిరీష్ సంఘీ వంటి వారికి సైతం అసాధ్యమయ్యింది.

ఎన్ని పత్రికలు చదివినా "ఈనాడు" చదవాల్సిందే అన్న స్థాయికి తెలుగు పాఠకుడిని తీసుకెళ్ళిన ఘనత ఆ పత్రికకు వుండేది. అయితే ఈనాడును అంతే స్థాయిలో ఎదుర్కోగల ధీటైన పత్రికగా "సాక్షి" 2008లో అవతరించింది. ఈనాడు కన్నా ఎక్కువ ఎడిషన్లతో తెలుగు పాఠకులను ఆకట్టుకుంది. వార్తలను అందించడంలో సైతం ఎన్నో విషయాల్లో ఈనాడు కంటే, ముందుండడమే కాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుని తెలుగువారి మనస్సాక్షిగా అవతరించింది.

ఈ ఆర్భాటాలూ ఈ పోటీ విధానాలు తెలుగువారికి వినోదాన్నందించాయే తప్ప ఆర్థికంగా ఏ పత్రికా బలపడలేని పరిస్థితి ప్రస్తుతం తెలుగుపత్రికా ప్రపంచంలో ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. పత్రికల ద్వారా ప్రభుత్వాలను శాసించి తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకునే వేదికల్లా ఈ పత్రికలు తయారయ్యాయి తప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం చూపగలిగి ప్రజా నాయకులకు ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధులుగా మాత్రం నిలవలేక పోయాయి.

దినపత్రికలలో పనిచేసే కొందరు "స్ట్రింగర్" స్థాయి రిపోర్టర్లు సైతం అధికారులను భయపెట్టి కోట్లకు పడగలెత్తి వున్న పరిస్థితులు నేటి పత్రికా ప్రపంచంలో నెలకొన్నాయంటే జర్నలిజం ఎంత దీన స్థాయికి దిగజారిపోయిందో వేరే చెప్ప నక్కరలేదు.

నష్టాలొస్తున్నాయన్న నెపంతో ఇప్పుడు దినపత్రికలు ఒక్కొక్కటిగా తమ ఎడిషన్లను మూసివేయబోతున్నాయి. ఈనాడు పత్రిక కేవలం తెలంగాణలో 2, ఆంధ్రప్రదేశ్‌లో 3ఎడిషన్లతో గతంలో లాగా తన ప్రస్థా నాన్ని కొనసాగించబోతోంది. శరవేగంగా పెరిగిపోయిన సాంకేతిక నైపుణ్యం, ఇంట ర్నెట్ ద్వారా త్వరితగతిన సమాచారాన్ని చేరవేయగలిగే సదుపాయం, ఒకచోట నుండి మరోచోటకు పేజీలని క్షణాల్లో పంపించ గలిగే వసతి అందుబాటులోకి రావడంతో తమ ఎడిషన్లను తగ్గించి నష్టాలను పూడ్చుకునే పనిలో పత్రికలు పడ్డాయి. ఇప్పటికే ఈనాడు కొన్ని ఎడి షన్లను మూసివేయగా, సాక్షి కూడా అదే బాటలో పయనించబోతున్నట్లు సమా చారం. ఇదే జరిగితే ఈ రెండు పత్రికల నుండే వేల సంఖ్యలో ఉద్యోగులు రోడ్డున పడే అవకాశాలున్నాయి.

రాష్ట్రం రెండు ముక్కలు కావడం వల్ల మిగిలిన రంగాలకు ఎంతటి కష్టం, నష్టం వాటిల్లిందో మీడియా కూడా అంతే స్థాయిలో విలవిలలాడుతోంది.

ఎక్కడికక్కడ ఉద్యోగులు సైతం ప్రాంతీ యతత్వంతో రెండుగా విడిపోవడంతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్ర సంస్థలకు సంస్కరణల మార్గం పట్టక తప్పడంలేదు. కోట్లకు పడగలెత్తిన దినపత్రి కలూ, టి.వి.ఛానళ్ళు ఈ పరిస్థితిలో వుంటే మరి రానున్న రోజుల్లో బిక్కుబిక్కు మంటూ బ్రతికే వారపత్రికలు, స్థానిక పత్రికల పరిస్థితి ఎంత దయనీయంగా వుండబోతోందో అర్థం చేసుకోవచ్చు.

మొత్తానికి "వినాశకాలే విపరీత బుద్ధి" అన్నట్లుగా అనారోగ్యమైన పోటీతత్వం అర్థంపర్థంలేని ఆధిపత్య పోరాటాలతో తమ నెత్తిన తామే మట్టేసుకునే పరిస్థితిని ఈ మీడియా దిగ్గజాలు తెచ్చుకున్నాయి. మారిన సాంకేతిక పరిజ్ఞానం ఈ స్థితికి ఓ కారణమైతే యాజమాన్యాల అర్థరహిత మైన ఆలోచనలు ఈ దుస్థితికి మరో కారణమని చెప్పొచ్చు.

## అదే కోవలో టి.వి.ఛానళ్ళు

పత్రికా ప్రపంచం సంక్షోభంలో పడడానికి మూలకారణం టి.వి.ఛానళ్ళు. ప్రతి సెకనుకీ తమ బ్రేకింగ్‌లతో ప్రేక్షకులకు షేకింగ్ తెప్పిస్తూ ఎప్పటికప్పుడు వున్నవీ లేనివీ జరిగినవీ జరగనివీ ప్రేక్షకుల కందిస్తూ తమ ప్రతాపం చూపిస్తున్నాయి కొన్ని టి.వి.ఛానెళ్ళు. ఇవి కూడా పుట్టలకొద్దీ పుట్టుకొచ్చి వాటి మనుగడకి అవే ముప్పు తెచ్చుకున్నాయి. పత్రికా ప్రపంచంలో సంక్షోభం రావడానికి, అవి వాటి ఖర్చులు తగ్గించి నష్టాలు పూడ్చుకోవడానికి కొన్ని దశాబ్దాల సమయం పడితే టి.వి.ఛానళ్ళు మాత్రం కేవలం దశాబ్దకాలంలోనే తమ స్పీడుకు తామే కళ్ళెం వేసుకునే పరిస్థితులు వచ్చేసాయి. గతంలో ఇస్తున్నంత జీతం ఇవ్వలేమంటూ కొన్ని ఛానళ్ళు ఇప్పటికే తమ బ్యూరోలకు, రిపోర్టర్లకు లేఖలు పంపిస్తే టివి9 ఏకంగా ఓ అడుగు ముందుకేసి సంస్థ నష్టాల్లో వుంది కాబట్టి మాకు సగం జీతమే ఇవ్వండి అంటూ తమ ఉద్యోగులే తమకు లేఖలు వ్రాసినట్లుగా వ్రాయించుకుని సంతకాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# టెన్‌జనపథ్ ముందు సంబరాలు

శ్రీను గల్పిక

అది ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, సీనియర్ నేత అద్వానీ, కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, అనంతకుమార్ తదితరులు కూర్చుని టీవీలో మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలను చూస్తున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీకే అత్యధిక స్థానాలు అన్నట్లు బ్రేకింగ్ న్యూస్ వస్తున్నాయి. అది చూసి మోడీ ముఖంలో ఆందోళన... ఆ రెండు రాష్ట్రాల్లో ఎందుకు గెలుస్తున్నామబ్బా అన్నట్లు తలకాయ కొట్టుకుంటున్నాడు. అమిత్‌షా అయితే తలమీద చేయి పెట్టుకుని ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగాలుగా కూర్చున్నాడు. వారిద్దరినీ చూసి అద్వానీ... ఏంటి సంబరాలు చేసుకోవాల్సిన టైంలో మీరు ఆ విధంగా తెల్లముఖాలు వేసుకుని కూర్చున్నారని అడిగాడు. వెంటనే మోడీ స్పందిస్తూ... మీకేం తెలుస్తుంది మా బాధ... మొన్న లోక్‌సభ ఎన్నికల్లో అంచనా వేసుకున్నదాని కంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. ఇప్పుడు చూస్తే హర్యానాలో సొంతంగా అధికారంలోకి వస్తామని కలలో కూడా అనుకోలేదు. మహారాష్ట్రలో మనదే పెద్ద పార్టీ అవుతుందని ఊహించనూ లేదు. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి. ఐదేళ్లలోనే ఈ దేశ తలరాతను తిరగరాస్తానని నేను చెప్పిన మాటలను ప్రజలు బలంగా నమ్మినట్లున్నారు. అందుకే మనకు సంబంధంలేని రాష్ట్రాల్లో కూడా అధికారం కట్టబెడుతున్నారు. దీన్ని బట్టి నా మీద అంచనాలు పెరుగుతున్నాయని పిస్తుంది. ఈ ఐదేళ్లలో నేనూ ఏమీ చేయలేకుంటే నన్ను కూడా మన్మోహన్‌సింగ్ కంటే హీనంగా చూస్తారు. అదే నా బాధ అని చెప్పాడు. అందుకు అద్వానీ... అధికారం కోసం మాటలు చెప్పడం కాదు, ఓట్లేయించుకుని మాట తప్పినప్పుడు ప్రజల చేత మాట పడక తప్పదన్నాడు. వెంటనే వెంకయ్యనాయుడు కలుగజేసుకుని... కాంగ్రెస్ యాభైఏళ్లలో చేయలేనిది మనం 5ఏళ్లలో చేయగలమా? ప్రజలకు కూడా ఇదే చెబుదాం, ఐదేళ్ల తర్వాత ఇంకో ఐదేళ్లు అధికారాన్ని ఎక్స్‌టెన్షన్ చేయమని అడుగుదాం... కొన్ని కొన్ని విషయాలలో మనం కూడా కాంగ్రెస్‌ను అనుసరించిపోతుండాలని చెప్పాడు.

★★★★★

టెన్‌జనపథ్ కార్యాలయం ముందు భారీగా కార్యకర్తలు గుమికూడి వున్నారు. అందరిచేతల్లోనూ కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడుతున్నాయి. కార్యకర్తలందరూ ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకుంటున్నారు. కొందరు కార్యకర్తలు రాహుల్‌గాంధీని తమ భుజాలపైకి ఎత్తుకుని జయజయ ధ్వానాలు చేస్తున్నారు. టీవీలలో మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలను చూసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిగ్విజయ్‌సింగ్, సుశీల్‌కుమార్ షిండే, గులాంనబీ ఆజాద్, వీరప్ప మొయిలీ, అంబికాసోని, అహ్మద్ పటేల్‌లు సోనియా, రాహుల్‌లకు ధైర్యం చెబుదామని అక్కడకు వచ్చారు. అక్కడ జరుగుతున్న సంబరాలను చూసి ఆశ్చర్యపోయారు. ఎన్నికల ఫలితాలేమైనా తారుమారయ్యాయా అనుకుంటూ టెన్‌జనపథ్‌లోని హాల్‌లోకి వెళ్లి ఎంతో ఆతృతగా టీవీ ఆన్‌చేశారు. కాని టీవీలో చూస్తే ఎన్నికల ఫలితాలలో ఎటువంటి మార్పులేదు. రెండురాష్ట్రాలలోనూ బీజేపీనే మెజార్టీ సీట్లు సాధించింది. మరి ఇక్కడ సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో అర్ధంకాక సీనియర్ నాయకులంతా బుర్ర గోక్కోసాగారు. అంతలో అక్కడకు పెద్ద గిన్నెలో స్వీట్లు పెట్టుకుని సోనియాగాంధీ వచ్చింది. ఆమె చేతిలో వున్న స్వీట్లు చూసి దిగ్విజయ్‌సింగ్.. త్యాగమయి వంటే నీవేనమ్మా, ఇంత బాధాకరమైన సమయంలో కూడా వచ్చిన అతిథులకు దీపావళి స్వీట్లు పెడుతున్నారన్నాడు. ఆ మాటకు సోనియా... బాధాకరమా, ఎందుకు? అని అడిగింది. దిగ్విజయ్ వుండి... మహారాష్ట్ర, హర్యానా రెండు రాష్ట్రాల్లో ఓడిపోయాం కదమ్మా అని అన్నాడు. అందుకే కదా ఈ సంబరాలు... ఈ స్వీట్లు పంచడం అని సోనియా అంది. ఓడిపోయినందుకు స్వీట్లు పంచుతున్నారా, ఓటమి షాక్‌తో మీకు ఉన్న మైండ్ కూడా పోయినట్లుందని వీరప్పమొయిలీ అన్నాడు. అప్పుడు సోనియా... దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఇంతకు ముందు ఏదో ఒక సందర్భంలో కాంగ్రెస్‌పాలన నడిచింది. అలాగే ప్రతి రాష్ట్రంలోనూ ఒకసారి బీజేపీ కూడా పరిపాలన చెయ్యాలి. కాంగ్రెస్ ప్రభుత్వాలు మెజార్టీ ప్రజలను ఒకరకమైన వ్యసనానికి అలవాటు చేశాయి. మీరేమీ పని చేయొద్దు, మీ ఇంట్లోకి బియ్యం, కిరసనాయిలు, కూరగాయలు, పప్పులు, ఉప్పు అన్నీ మేమే ఇస్తామని చెప్పి మనం దానిని అలవాటు చేసాం. ప్రజలు కూడా ఫ్రీ పథకాలకు బాగా అలవాటుపడ్డారు. ఇప్పుడు మోడీ వచ్చి స్వచ్ఛభారత్ అంటూ అందరి చేత చీపుర్లు పట్టిస్తున్నారు. అందరూ పనిచేస్తేనే అభివృద్ధి అంటున్నాడు. దీనిని ప్రజలు హర్షించరు. ప్రభుత్వమే మాకు అన్నీ చేసిపెట్టాలి అనే విధంగా మనం ప్రజల మైండ్‌సెట్‌ను బలంగా మార్చాం. ఈరోజు మోడీ వచ్చి వాళ్ల మైండ్‌సెట్ మార్చాలంటే కుదురుతుందా? కాబట్టి అన్ని రాష్ట్రాల్లో ఒకసారి బీజేపీని చూడాలి. పని చేసుకోమని చెప్పే ప్రభుత్వాలు ఎల్లకాలం ఉండవు. మీ పని కూడా మేమే చేస్తామని చెప్పే ప్రభుత్వాలే భారతదేశంలో ఎక్కువకాలం ఉంటాయి. కాంగ్రెస్ ఎక్కువ కాలం అధికారంలో ఉండడానికి ఇదే మూలసూత్రం. ఐదేళ్ల తర్వాత ఈ దేశం మొత్తం మనదే... కాబట్టే ఈ వేడుకలని చెప్పింది. ఆమె మాటలతో అందరూ ముక్కున వేలుసుకున్నారు.

కదంబం

## దీక్షా వ్రతం

– చిన్ని నారాయణరావు,
నెల్లూరు.

దీక్ష –
చిత్తశుద్ధి లేని శివపూజ
నిబద్ధత కన్పించని కృత్రిమ ఆశయం
భావోద్వేగం లేని ప్రేమాతిశయం
ఏం సాధించాలనో ఎక్కుపెట్టిన
ఆ బాణం... దీక్షావ్రతం!

రోజుకో దీక్ష
రకరకాల దక్షతలే
ఈ దీక్షలకు శ్రీరామరక్ష
రిలేదీక్ష... గంటల దీక్ష
సెలైన్ దీక్ష...
ఎన్ని ఆత్మవంచనల దీక్షలో
లేనిదొక్కటే అకుంఠిత దీక్ష!

రోజుకు ముప్పొద్దులా
భుజించి త్రేన్చేవాళ్ళు
కడుపులో చల్ల కదలకుండా
వ్యవహారం సాగించేవాళ్ళు
తినడానికే పుట్టినట్లు
ఆబగా లాగించేవాళ్ళు
ఆకలిని అసహ్యించుకొనే వాళ్ళు
వీళ్ళ దీక్ష ఏపాటిది?

స్వాతంత్ర్యమే లక్ష్యంగా
సత్యాగ్రహ తపమాచరించిన
గాంధీజీ ఆశయాల వారసులా?
అల్లూరి, భగత్‌సింగ్‌లకు
అసలు సిసలు రూపాలా?
ఆత్మార్పణకే అర్థం చెప్పిన
అమరజీవి వారసులా..?
ఎవ్వరీ దీక్షల మరాళీలు.

వీళ్ళ స్వప్నం అధికార పీఠం
వీళ్ళ కోర్కె రాజకీయ ఉత్థానం
సీట్ల కోసమే కోటి సర్కస్ ఫీట్లు
ఓట్ల కోసం ఊసరవెల్లులు వాళ్ళు
మన గుండెలపై పాదముద్రలు
చెరిగిపోక ముందే
తమ కాళ్ళను శిరస్సుపై ఎక్కుపెట్టిన వాళ్ళు!

కార్తీక పూజల్లో

## భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత



కార్తీక మాసోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్, మేయర్ అజీజ్ తదితరులు

కార్తీకమాసంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి అధికప్రాధాన్యతనివ్వాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 24 నుండి నవంబర్ 22వరకు కార్తీక మాస పూజలు జరుగనున్నాయి. దీనికి సంబంధించి నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపూజలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన వసతులపై ఆయన సోమవారం అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లడుతూ కార్తీకమాసంలో ప్రతిరోజూ వేల సంఖ్యలో మహిళా భక్తులు వస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో చైన్‌స్నాచింగ్‌లు, ఈవ్‌టీజింగ్ ఎక్కువుగా వున్న దృష్ట్యా పోలీసు నిఘాను పెంచాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. విఐపిల సేవలో కాకుండా సామాన్యభక్తులకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన కోరారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పవిత్ర కార్తీకమాసంలో ఆలయంకు వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ ద్వారా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, మంచినీరు వంటి పనులు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీఛైర్మెన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు చాట్ల నరసింహరావు, కార్పొరేటర్ గోగుల నాగరాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక మాసోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే అనిల్, అతిథులు ఆవిష్కరించారు.

## పోలీసు అమరవీరులకు స్వర్ణ నివాళి

నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు ముసవ్విర్ పోలీసు అమరవీరుల త్యాగం స్వర్ణ సమానమని చూపుతూ బంగారంతో సూక్ష్మ ఆయుధ నమూనాలను తయారుచేసి అమరవీరులకు నివాళులర్పించారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసులు వినియోగించే బ్యారెల్‌గన్ నమూనాను 0.6గ్రాముల బంగారుతో 6సెం.మీ పొడవు, 1సెం.మీ వెడల్పుతోను, పిస్టల్ నమూనాను 1.2గ్రాముల బంగారంతో తయారుచేసి ప్రదర్శించారు. ఈ నమూనాల తయారీకి రెండురోజుల సమయం పట్టిందని ముసవ్విర్ తెలిపారు.

## కమనీయం.. శ్రీవారి కల్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, స్థానిక శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో శ్రీనివాస కల్యాణం మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. 30రకాల పుష్పాలతో శ్రీవారికి పుష్పయాగాన్ని కనులపండువగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా భక్తి సంగీత గాయకుడు గుండాల గురవయ్య అన్నమాచార్య కీర్తనలు, మహిళా భక్తుల కోలాట భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి గౌరవాధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులు కొండా బలరామిరెడ్డి, అధ్యక్షుడు కళాదీప్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తులు అధికసంఖ్యలో హాజరవడంతో టౌన్‌హాలుకు ఇరువైపులా ఉన్న వరండాల్లో ఎల్ఇడి టీవీలను భక్తుల కోసం ఏర్పాటు చేశారు.


## స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధిద్దాం



విజేతలకు బహుమతిన్నందజేస్తున్న ముఖ్యఅతిథులు

రత్నమ్మ చారిటబుల్ సొసైటి మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 21వ తేదీ బుజబుజ నెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషుమీడియం స్కూలు నందు స్వచ్ఛభారత్ – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. స్కూలు కరస్పాండెంట్ యన్.వి. సుబ్బయ్య సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పి.యస్.పి అసోసియేషన్ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, సంస్థ అధ్యక్షుడు కె.మురళీ మోహన్‌రాజు, రచయిత పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ, రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి సభ్యులు రాచపాళెం రఘు వంశీ, రవి గోగులపల్లిలు పాల్గొన్నారు.

## • విశాఖ కోసం



### తండ్రి బాటలో తనయుడు

# డా॥ కిషోర్ 6లక్షల విరాళం

భారతదేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా జిల్లా నుండి మొట్ట మొదటిగా స్పందించే వ్యక్తి "రత్నం" విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం మాష్టారు. ఆనాటి లాతూర్ భూకంపం నుండి మొన్నమొన్నటి "సునామీ" వరకు జిల్లాలో ముందుగా స్పందించి విరాళాన్ని ప్రకటించింది రత్నం గారే.

ఇప్పుడు ఆయన రెండవ కుమారుడు "కిషోర్స్ రత్నం" సంస్థల సారధి డా॥ కె.కృష్ణకిషోర్ కూడా తండ్రి బాటలో నడుస్తున్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు పుణికి పుచ్చుకున్న "కిషోర్" విశాఖ తుఫాను బాధితులకు తనవంతు సహాయంగా 6లక్షల రూపాయలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి చెక్కురూపంలో అందించాడు.

### "కిషోర్"ని అభినందించిన చంద్రబాబు

విలవిలలాడుతున్న విశాఖను ఆదుకోవడానికి కిషోర్ వంటి యువ విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు పెద్ద మనసుతో ముందుకురావాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల నిర్వహణలోనే కాకుండా సేవారంగంలో కూడా తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న "కిషోర్"కి 'లాయర్' అభినందనలు.

## • రెంటికీ చెడ్డ రేవడి

# అయోమయంలో అజీజ్



***నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్‌ను చూస్తుంటే నాటు సామెత ఒకటి గుర్తొస్తుంది. అంత మొరటు సామెత చెప్పడం బాగుండదు కాబట్టి రెంటికి చెడ్డ రేవడిలా మారాడని చెప్పవచ్చు.***

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున తిరుగులేని మెజార్టీతో మేయర్‌గా ఎన్నికైన అజీజ్, ఏ మాత్రం గ్యాప్ తీసుకోకుండా, కనీసం ఒక్క కౌన్సిల్ సమావేశం కూడా జరక్కముందే తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అజీజ్ పార్టీ మారడానికి ప్రధాన కారకుడు మంత్రి నారాయణే. ఆయన గట్టిగా భరోసా ఇవ్వబట్టే అజీజ్ తెలుగుదేశంలోకి వెళ్లాడు. పార్టీ మారడంలో అజీజ్ చాలా వాటిని ఫణంగా పెట్టాడు. ముందుగా మైనార్టీల విశ్వాసాన్ని కోల్పోయాడు. ఆయన నైతికత మీద నెగటివ్ ముద్ర పడింది. మేయర్‌గా తొలిపదవి. ఆ పదవిలోకి రాగానే పార్టీ మార్చడం ప్రజలు సాధారణంగా అంగీకరించరు. అజీజ్ వైకాపాలోనే ఉండుంటే నమ్మకం, నైతికత అలాగే వుండేవి. రాబోయే కాలంలో ఇంకా మంచి భవిష్యత్ ఉండేది. కాని ఎంతో రాజకీయానుభవం ఉన్న నాయకుల కంటే వేగంగా అజీజ్ పార్టీ మారాడు. తెలుగుదేశంలో చేరాక ఏదో చేసేద్దామనుకున్నాడు. అజీజ్‌కు మేయర్ పదవిని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యం లేదు. కాకపోతే తనదైన బ్రాండ్ వేసుకోవాలనుకున్నాడు. తన పనితీరుతో నెల్లూరును దున్నేయాలనుకున్నాడు. ఐఏఎస్ కమిషనర్‌ను వేయించుకుని నెల్లూరులో అవినీతి, అక్రమాలను చీల్చి చెండాడాలనుకున్నాడు.

కాని ఇక్కడ చూస్తే సీన్ రివర్స్. కార్పొరేటర్లలోనే మూడువర్గాలు. ఒకరు స్వచ్ఛమైన తెలుగుదేశం, మరొకరు నిఖార్సయిన వైకాపా, మూడో వర్గం వైకాపా నుండి అజీజ్ వెంట తెలుగుదేశంలోకి వచ్చిన వాళ్లు. వైకాపా వాళ్లు ఎలాగూ అజీజ్‌ను వ్యతిరేకిస్తారు. తెలుగుదేశం వాళ్లయితే అజీజ్‌తో కలిసి సాగడానికి ఇష్టపడడం లేదు. ఇక అజీజ్ వెంట వెళ్లినవాళ్లలో చాలామంది దూరంగా వుంటున్నారు.

కార్పొరేటర్లలో అజీజ్ బలమేంటనేది తొలికౌన్సిల్ సమావేశంలోనే అర్ధమైపోయింది. తొలి సమావేశంలో అనుబంధ అజెండాను కూడా ఆమోదింపచేసుకోలేకపోయారాయన. దీనికితోడు మంత్రి నారాయణ చేతిలో ఒకటికి రెండుసార్లు చీవాట్లు పడ్డాయి.

ఈ పరిణామాలతో అజీజ్ తీవ్ర అయోమయానికి గురయ్యాడు. పార్టీ మారి తప్పు చేసానేమోననే భావం ఆయనలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల వరుసగా జరిగిన పరిణామాలతో అజీజ్ మనస్థాపం చెంది, నగరంలో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

# ఎన్టీఆర్ సుజల స్రవంతికి నిధులు కేటాయించాలి

### - జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి



ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం అమలుకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలని నెల్లూరు జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరుజిల్లా కలువాయి మండలం బద్వేవోలు బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఆదివారం జరిగిన 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమానికి వచ్చిన రాఘవేంద్రరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సుజలస్రవంతి పథకం క్రింద మంచినీటి ప్లాంట్ ఏర్పాటుచేసి రూ.2లకే 20లీటర్ల తాగునీరు ప్రజలకు అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఇప్పుడు మాటమార్చి ప్లాంట్లు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పిలుపునివ్వడం తగదన్నారు. తన స్వగ్రామమైన బట్టేపాడులో మూడునెలల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపిపి శిల్పం సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో పోలీసుల పాత్ర కీలకం


### పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో కలెక్టర్



సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైనదని, సమాజానికి మెరుగైన సేవలు అందించడం, శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసు అమరవీరులకు మనమిచ్చే గౌరవమని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని ఈ నెల21న నెల్లూరులోని పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. మన రాష్ట్రంలో పోలీసు శాఖ ఎంతో పటిష్టంగా వుందని, ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడంలో, భూ తగాదాలు, రౌడీయిజం వంటివాటిని అరికట్టడంలోనూ మన పోలీసులు ఎంతో ముందున్నారని ప్రశంసించారు. పోలీసులు ఇరవై నాలుగు గంటలూ ప్రజలకు అందుబాటులో వుండి, వారి సేవలను అందిస్తున్నారని ఆయన కొనియాడారు. సమాజంలో ఎలాంటి సమస్య ఎదురైనా అక్కడ పోలీసుల అవసరం వుంటుందని, కనుక అన్నిశాఖల వారినీ సమన్వయంతో కలుపుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను వివరిస్తూ వారికి ఘన నివాళులర్పించారు. తొలుత, జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి పోలీసులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పోలీసు అమరవీరుల స్థూపానికి పుష్పమాలికలు వేసి, నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల మృతిచెందిన ఎనిమిదిమంది పోలీసు కుటుంబాలవారికి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా జ్ఞాపికలు, పోలీసు అధికారుల సంఘం తరపున రూ.50వేల నిధిని అందజేశారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గత వారం రోజులుగా పోలీసు అధికారులు, ఎస్ఐలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైనవారికి బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలైన టూటౌన్ ఎస్ఐ కె. సాంబశివరావు, బి.శ్రీనివాసరెడ్డి (స్పెషల్ బ్రాంచ్), జి.అజయ్‌కుమార్ (గూడూరు 1వ టౌన్)లకు నగదు బహుమతులతో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇదేవిధంగా, జిల్లాలోనూ పలుచోట్ల పోలీసు అమరవీరుల దినం సందర్భంగా పోలీసులు, అధికారులు, ప్రజలు అందరూ కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమరులైన పోలీసుల త్యాగాలను కొనియాడారు. వారి సేవలను స్మరించుకుంటూ, వారికి నివాళులర్పించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com